**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499

సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



**టీవీ రిపోర్టర్లు కావలెను**

A.P VISION TV

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499

యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు బుధవారం 27-08-2025 సంపుటి : 11 సంచిక : 201 పేజీలు : 8 వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


# మారుతున్న కాలానుగుణంగా బ్యాంకర్లు మారాలి

రైతులు,ప్రజలకు రుణాల విషయంలో తీరు మార్చుకోవాలి

ప్రజలను నియంత్రించేలా బ్యాక్ పాలసీలు ఉండరాదు

స్టేట్ లెవల్ బ్యాంకర్స్ మీట్‌లో సిఎం చంద్రబాబు

అమరావతి,ఆగస్ట్26: రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా బ్యాంకుల నిర్ణయాలు ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకర్లు తమ తీరు మార్చుకోవాల్సి ఉందన్నారు. జీఎస్టీలో సంస్కరణల్ని కేంద్రం తీసుకువచ్చిందని. నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలు వచ్చేస్తున్నాయని.. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజల్ని నియంత్రించకూడదని తెలిపారు. తదుపరి సంస్కరణల దిశగా ప్రోత్సహించాలన్నారు. ఖరీఫ్‌లో ఇప్పటికే సగం సమయం గడిచిపోయిందని, ఈ పాటికే రైతులకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాల్సిఉందని చెప్పారు. సీజన్ ఆఖరులో రుణాలు ఇవ్వడం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం ఉ ఒడదన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశమైంది. 231 ఎస్ఎల్‌బీసీలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టుపై సీఎం సమీక్ష నిర్వహించారు. వన్ ఫ్యామిలీ - వన్ ఎంటప్రెన్యూర్ కార్యక్రమానికి బ్యాంకుల సహకారంపై చర్చించారు. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు- అంశం పైనా చర్చించారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకర్లూ తీరు మార్చుకోవాల్సి ఉంది. కేంద్రం.. జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చింది. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజలను నియంత్రించ కూడదన్నారు. తదుపరి సంస్కరణల దిశగా ప్రజలను ప్రోత్సహించాలి. అమెరికా, చైనా లాంటి దేశాలకు సవాల్ విసిరేలా మన ఆర్థిక వ్యవస్థ తయారవుతోంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలి. 2047 నాటికి భారత్ బలమైన ఆర్థికవ్యవస్థగా తయారవుతుంది. ఉత్పాదకత లేని రుణాలు కూడా మంచివి కాదు. పేదలు- ధనికుల మధ్య అంతరాలు తగ్గేందుకు చర్యలు చేపట్టాలి. ఆర్థికశాస్త్రం చదివిన విద్యార్థిగా, ప్రజాప్రతినిధిగా పేదల కోసమే ఆలోచిస్తా. దేశంలో సంపద సృష్టి, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా బ్యాంకులు, ఆర్థికసంస్థలు పని చేయాలని



చంద్రబాబు అన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఈ, ఎస్ హెచ్ జీ రంగాలు, రుణ వితరణ లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలపై అధికారులతో చర్చించారు. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు- అంశంలో బ్యాంకుల సహకారంపై చర్చలు జరిపారు. ఎస్ఎల్ బీసీ సమావేశాలు.. రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలని సూచించారు. రోటీన్ సమావేశాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, ఇండికేటర్లు కూడా రోటీన్‌గా మారుతున్నాయని చెప్పారు. ఆర్థిక సంస్థలు కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలని అధికారులకు సూచించారు. 2047 నాటికి బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుందన్నారు. ఈ క్రమంలోనే ఫాల్స్ లెండింగ్ చేయాలని ఎవరూ సిఫార్సు చేయరని, ఉత్పాదకత లేని రుణాలు కూడా మంచివి కావని వ్యాఖ్యానించారు. పేదలు- ధనికుల మధ్య అంతరాలు తగ్గేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికశాస్త్రం చదివిన విద్యార్థిగా, ప్రజాప్రతినిధిగా పేదల గురించి తాను ఆలోచన చేస్తున్నట్లు- తెలిపారు. ఓ దశలో సంపద సృష్టి కోసం, పరిశ్రమల కోసం దావోస్ లాంటి ప్రాంతాల్లో విస్తృతంగా తిరిగానన్నారు. దేశంలో సంపద సృష్టి, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సమిష్టిగా పనిచేయాలని ముఖ్యమంత్రి




చంద్రబాబు నాయుడు కోరారు. సిఎస్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణహిత గణేశ్ విగ్రహాల తయారీ

ఎకోఫ్రెండ్లీ వినాయక ప్రతిమలతో రికార్డు నమోదు

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో పేరు నమోదు

అభినందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ,ఆగస్ట్26:ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర మాసోత్సవాల్లో రెండు ప్రపంచ రికార్డులు సొంతం చేసుకున్న ఎన్టీఆర్ జిల్లా కొత్త ఉత్సాహంతో ముందుకు కదిలి పర్యావరణహిత గణేష్ చతుర్థిని జరుపుకునేలా ప్రజలను ప్రోత్సహించేందుకు సరికొత్త ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. అయిదువేల పర్యావరణహిత మట్టి ప్రతిమల తయారీని లక్ష్యంగా నిర్దేశించుకోగా 7,730 ప్రతిమల తయారీతో రికార్డును కైవసం చేసుకుంది. గతంలో మహారాష్ట్రలో 4,464 ఎకోఫ్రెండ్లీ వినాయక ప్రతిమలతో రికార్డు నమోదుకాగా.. మంగళవారం జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో చేసిన ప్రయత్నం కొత్త



రికార్డును లిఖించినట్లు- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ భారత దక్షిణాది జాయింట్ సెక్రటరీ డా. యు.ఇలియాజర్ ప్రకటించారు. ఈ రికార్డు సాధనకు కృషిచేసిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు- పేర్కొని రికార్డు సాధించినందుకు సర్టిఫికెట్‌ను, పతకాన్ని కలెక్టర్ డా. జి.లక్ష్మీశకు అందజేశారు. మెగా ఈవెంట్ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పర్యావరణంపట్ల బాధ్యతను గుర్తుచేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. గణేష్ ఉత్సవాల్లో ప్రతి అంశానికీ ఓ ప్రత్యేకత ఉందని.. ప్రజలు ఒకవైపు సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూనే మరోవైపు పండగలను పర్యావరణహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మండపాల (మిగతా 7 లో)

# ఎలక్ట్రిక్ వాహనరంగంలోకి మారుతి

తొలి ఇవి- విటారా ఉత్పత్తి ప్రారంభం

వంద దేశాలకు ఎగుమతి లక్ష్యంగా ఉత్పత్తులు

గుజరాత్ హన్సల్‌పూర్ ప్లాంట్‌లో ప్రారంభించిన మోడీ

గాంధీనగర్,ఆగస్ట్26: భారత ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలకు అందిస్తున్న ప్రోత్సాహంతో అనేక కంపెనీలు భారత అవసరాలతో పాటు- విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఎలక్ట్రిక్ కార్లు, ఈవీ స్కూటర్లను తయారు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మారుతీ సుజుకీ కంపెనీ తయారు చేసిన తొలి మేడిన్ ఇండియా ఎలక్ట్రిక్ కారు విదేశాల్లోనే అమ్మకాలకు సిద్ధం అయ్యింది. దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. ఈక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్‌లోని హన్సల్‌పూర్ మారుతీసుజుకీ మోటార్ ప్లాంట్‌లో రెండు కీలక ప్రాజెక్టులు ప్రారంభించారు. మారుతీ సుజుకీ తొలికారు ఇ-విటారా తో పాటు- హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ ఉత్పత్తి చేసే తొలి ప్లాంట్‌కు జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, జపాన్ రాయబారి కీచీ ఒనొ పాల్గొన్నారు. భారత్ స్వాలంబన సాధించేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు ఇది ప్రత్యేకమైన రోజు. ఇక్కడ ఉత్పత్తి కానున్న కార్లు 100 దేశాలకు ఎగుమతి కానున్నాయని ఈ కార్యక్రమానికి ముందు మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇ-విటారా తొలికారు యూకేకు ఎగుమతి కానుంది. తొషిబా, డెన్సో, సుజుకీసంస్థల భాగస్వామ్యంతో ఆ ప్లాంట్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ తయారుకానున్నాయి. దాంతో 80 శాతం బ్యాటరీ దేశీయంగా సిద్ధం కానుంది. ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ తన తొలి విద్యుత్ కారు ఇ-విటారా జనవరిలో ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. ఈ కారును 100కు పైగా దేశాలకు ఎగుమతి చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా భారత్‌ను గ్లోబల్ ప్రొడక్షన్ హబ్‌గా తీర్చిదిద్దాలనుకుంటున్నట్లు సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రెసిడెంట్




తొషిహిరో సుజుకీ అప్పుడు వెల్లడించారు. మారుతీ సుజుకీ ఇ-విటారా రెండు బ్యాటరీ ఆప్షన్లతో వస్తోంది. 49 కిలోవాట్ అవర్ బ్యాటరీతో వస్తున్న కారు 144 హెచ్‌పీ శక్తిని, 189 కప టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.

# చంద్రబాబుతోనే విద్యారంగం అభివృద్ది

డీఎస్సీ విజయవంతంపై మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి,ఆగస్ట్26: డీఎస్సీ విజయవంతంపై మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తంచేశారు. గత జనగ్ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కసారి కూడా నిర్వహించలేదన్నారు. సీఎం చంద్రబాబుతోనే విద్యా వ్యవస్థలో సమూల మార్పులు సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని కొల్లు స్పష్టంచేశారు. ఐదేళ్లలో జగన్ ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వకుండా మోసం చేశారు.




కూటమి తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టి యువతకు అండగా నిలిచింది. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలన్నీ పక్కాగా అమలు చేశాం. నమ్మి ఓట్లు- వేసిన యువతకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటు-ంది. అత్యుత్తమ విద్యా ప్రమాణాల్లో ఏపీని అగ్రగామిగా మార్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యంతో స్కూళ్లలో హాజరు శాతం పెరుగుతోంది. డీఎస్సీ విజయవంతం చేసినందుకు డీఎస్సీ అభ్యర్థుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విద్యారంగం అభివృద్ధికి మంత్రి లోకేశ్ తీసుకుంటున్న చొరవ అభినందనీయమని అన్నారు.

# గవర్నర్ అధికారాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: గవర్నర్ అధికారాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆర్టికల్ 200 ప్రకారం బిల్లులను



ఆపే అధికారం గవర్నర్‌కు ఉంటే.. మనీ బిల్లులను ఆపే అధికారం కూడా గవర్నర్‌కు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ అంశం కొంత సమస్యాత్మకమనేనని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. బిల్లులకు గవర్నర్లు ఆమోదం ఇవ్వకుండా వీటో చేస్తే.. వారు మనీ బిల్లులను కూడా అడ్డుకోవచ్చుని అభిప్రాయం వ్యక్తం చేసింది. సుప్రీం ధర్మాసనం అభిప్రాయంతో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే ఏకీభవించారు. బిల్లుల ఆమోదం అంశంలో గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి విధించడంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. బిల్లులను 3 నెలల గడువులోగా గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదించాలంటూ గతంలో జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై దుమారం రేగింది. రాష్ట్రపతి లేవనెత్తిన 12 సందేహాలపై సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. రాజ్యాంగంలో లేని అధికారాలపై సుప్రీంకోర్టు తీర్పులు ఎలా ఇవ్వగలదని అపెక్స్ కోర్టుకు 12 ప్రశ్నలతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సీజెఐ బీఆర్ గవాయ్, న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రమ్‌నాథ్, పీఎస్ నరసింహా, ఏఎస్ చందూర్‌కర్‌తో కూడిన రాజ్యాంగ ధర్మసనం మంగళవారం నాడు విచారణ జరుపుతోంది.

# సంపాదకీయం

బుధవారం 27-08-2025

## డబుల్ పెన్షన్ పై సర్వత్ర చర్చ...

తెలుగు రాష్ట్రాల్లో 'డబుల్ పెన్షన్' వార్త చర్చనీయమైంది. ఒకేఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచి... ఏదైనా కారణాలవల్ల నెలకో, రెండు నెలలకో 'మాజీ' అయినా జీవితాంతం పింఛను పొందవచ్చు. అదే నేత... ఎంపీగా గెలిస్తే, మాజీ అయిన తర్వాత ఆ హోదాలో మరో పింఛను ఇస్తారు. మాజీ ఎమ్మెల్యేగా రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేలు పింఛను ఇస్తే... మాజీ ఎంపీలకు కేంద్ర ప్రభుత్వం రూ.31వేలు జీవితాంతం చెల్లిస్తుంది.ఇలా ఒకే వ్యక్తికి రెండేసి పింఛన్లు ఇవ్వడంలో హేతుబద్ధత ఏమిటో ఎవరికీ అర్థం కాదు. పార్లమెంటు చట్టం ప్రకారం మాజీ ఎంపీలకు, రాష్ట్ర శాసనసభ చట్టాల ప్రకారం మాజీ ఎమ్మెల్యేలకు పింఛన్లు ఇస్తున్నారు. కానీ... ఒకే వ్యక్తికి రెండు పింఛన్లు ఇవ్వకూడదనే చట్టం మాత్రం లేదు.మాజీ ఎంపీగా, మాజీ ఎమ్మెల్యేగా పని చేసి రెండు పింఛన్లు తీసుకుంటున్న వారిలో మన రాష్ట్రంలో చాలామంది ఉన్నారు. వీరిలో... వందలు, వేల కోట్ల వ్యాపారాలు చేసే బడా పారిశ్రామిక వేత్తలు, స్టార్లు, రాజకీయ వారసు లూ ఉన్నారు. మన రాష్ట్రంలో ఎమ్మెల్యేగా ఒక్కరోజు పని చేసి మాజీ అయినా జీవితాంతం రూ.30వేలు పింఛను వస్తుంది. పొరుగు రాష్ట్రం తెలంగాణలో మాజీ ఎమ్మెల్యేలకు రూ.50 వేలు పింఛను చెల్లిస్తున్నారు. ఇక... మాజీ ఎంపీలకు రూ.31 వేల పింఛను అందుతుంది. విచిత్రం ఏమిటంటే... ఒకే వ్యక్తి 2 పదవులు చేసి మాజీ అయ్యాక అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు పింఛన్లు ఇచ్చేస్తున్నాయి. ఏదేమైనా.. వాళ్లు దీనిని వదులుకోవడంలేదు. మిగిలిన వాళ్లు తమకు తెలియకుండానే రెండూ తీసుకుంటున్నారు.ఒకే వ్యక్తి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేస్తే రెండు పెన్షన్లు తీసుకోవడం సరికాదంటూ ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లికి చెందిన డబ్ల్యూడీ గణేశ్ అనే ఆర్టీఐ కార్యకర్త అభిప్రాయపడ్డారు.చట్టసభ సభ్యులుగా పనిచేసిన మాజీలు ఏదో ఒక పెన్షన్ తీసుకుని మరొకటి వదిలేయాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే, చట్టం అనుమతిస్తుంది కాబట్టే, వారు డబుల్ పెన్షన్ తీసుకుంటున్నారని, ఇదేమీ నేరం కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.తెలుగునాట ఇలా డబుల్ పెన్షన్ తీసుకుంటున్న వారు 21 మంది ఉండగా, వారిలో సెలబ్రిటీలు, బడా వ్యాపారులు కూడా ఉన్నారు.ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలుగా పనిచేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవితాంతం పెన్షన్లు ఇస్తాయి. వారు మరణించిన తరువాత వారి భార్య/భర్తకు కూడా పెన్షన్ ఇస్తాయి.ఎంపీలుగా పనిచేసిన వారికి భారత ప్రభుత్వం రూ.31 వేల పెన్షన్ ఇస్తుండగా, ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారికి ఏపీ ప్రభుత్వం కనిష్ఠంగా రూ.30 వేల నుంచి గరిష్ఠంగా రూ.50 వేల వరకు పెన్షన్ ఇస్తోంది.ఇక తెలంగాణ కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.70 వేల వరకు ఇస్తోందని గణేశ్ చెప్పారు.సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) ప్రకారం తాను చేసిన దరఖాస్తుకు అధికారుల నుంచి వచ్చిన సమాధానంలో ఎంపీలు, ఎమ్మెల్యేల పెన్షన్ల డేటా తెలుసుకున్నానని గణేశ్ చెప్పారు.దాని ప్రకారం.. ప్రస్తుతం భారత్‌లో 2,229 మంది మాజీ ఎంపీలు పెన్షన్లు తీసుకుంటుండగా, ఏపీలో 473 మంది, తెలంగాణలో 465 మంది మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెన్షన్ తీసుకుంటున్నట్టు తెలిసిందని గణేశ్ అంటున్నారు.ఇవి కాకుండా వారికి ఇతర సదుపాయాలు ఉంటాయని ఆయన చెబుతున్నారు.పెన్షన్ కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలని, అలాంటి వారికే పెన్షన్ వస్తుందని ఆయనంటున్నారు."చట్ట ప్రకారం రెండు పెన్షన్లు తప్పు కాకపోవచ్చు. కానీ, రాజభరణాలను రద్దు చేసిన తీరులోనే వీటిని రద్దు చేయాల్సిన సమయం వచ్చింది. అప్పట్లో సొంత ఆస్తులు అమ్ముకున్న నాయకుల కోసం ఈ పెన్షన్లు వంటివి వచ్చాయి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అసలు పెన్షన్లే వద్దు అనడం లేదు. ఒక మనిషికి ఒక పెన్షన్, అది ఎమ్మెల్యేదో లేదా ఎంపీదో చాలు అంటున్నాను. ఇప్పుడు సుందరయ్య, ప్రకాశం, సంజీవయ్య వంటి వారు లేరు. పెన్షనే వద్దంటే అన్యాయం. ఒకటి చాలు, రెండు వద్దు అంటున్నాను" అని అన్నారు గణేశ్.ది శాలరీస్ అండ్ పెన్షన్ యాక్ట్' ప్రకారం ఎంపీలకు, తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు స్థానిక చట్టాల ప్రకారం ఈ పెన్షన్లను చెల్లిస్తున్నారు.2004 తరువాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి కూడా పెన్షన్లు ఉండవు.అంతేకాదు, ప్రభుత్వ రంగ సంస్థలు అంటే పీఎస్‌యూలలో పనిచేసే వారికి కూడా నామమాత్రపు పెన్షన్ వస్తుంది.లేని సౌకర్యం చట్టసభల సభ్యులకు మాత్రం ప్రభుత్వం ఎందుకు ఇవ్వాలని యాక్టివిస్టులు ప్రశ్నిస్తున్నారు.గ్యాస్ సిలిండర్ మీద సబ్సిడీ వదులుకోమని చెబుతున్న ప్రభుత్వాలు, డబుల్ పెన్షన్ వదులుకోమని ఎందుకు చెప్పడం లేదు?. ఈ జాబితాలో వందల కోట్ల ఆస్తులున్న వారు కూడా ఉన్నారు. పన్ను కట్టే వ్యక్తిగా అడిగే హక్కు నాకు, నాతో పాటు మనందరికీ ఉంది" అన్నారు గణేశ్.చట్ట ప్రకారం రెండు పెన్షన్లు తీసుకోవడం నేరం కాదు కాబట్టి, వారిని విమర్శించాల్సిన అవసరం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు."ఇందులో విమర్శించడానికి ఏమీ లేదు. ఎవరైనా కావాలంటే స్వచ్ఛందంగా తమ పెన్షన్ వదులుకుంటే బావుంటుంది. కానీ, వారిని వ్యక్తిగతంగా తప్పు పట్టాల్సిన అవసరం లేదు. కొందరు ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడే జీతం తీసుకోరు, మరికొందరు తీసుకుంటారు. అందులో ధనిక, తక్కువ ఆదాయం అన్న తేడా లేదు. మేం చేసిన దానికే ఇస్తున్నారు కదా అని వారు అనుకోవచ్చు. దానికి చట్టం అనుమతిస్తుంది. అయితే చట్టం మార్చాలి లేదా వ్యక్తిగత నిర్ణయానికి వదిలేయాలి. అంతేకానీ, చట్ట ప్రకారం తీసుకుంటున్న వారి విషయంలో ఇలా పేర్లు తీసుకుని, ఫోటోలు వేసి ఏదో నేరం చేసినట్టు చూపించడం మంచిది కాదు" అని రాజకీయ విశ్లేషకులు కటారి శ్రీనివాస్ అన్నారు.ప్రస్తుతం ఈ పెన్షన్లను ఎంపీలకు 'ది శాలరీస్ అండ్ పెన్షన్ యాక్ట్' ప్రకారం, తెలుగు రాష్ట్రాల చట్టసభల సభ్యులకు స్థానిక చట్టాల ప్రకారం చెల్లిస్తున్నారు.ఇవి 1953-54 ప్రాంతానికి చెందిన చట్టాలు.

# ప్రపంచ యూత్ ఛాంపియన్ షిఫ్ విజేతగా చికిత

**- భారత తొలి అర్చరి క్రీడాకారిణి గా చికిత రికార్డు**

**- భారత్ కు తొలి బంగారు పథకం అందించిన జిల్లా వాసి**

**- పలువ్వురు క్రీడాకారుల అభినందనలు**

పెద్దపల్లి పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్ పూర్ గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి తానిపర్తి చికిత తన అద్భుతమైన ప్రతిభతో అర్చరీ పోటీలో పాల్గొని దేశం గర్వించదగ్గ స్థాయిలో యూత్ చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. మన దేశంలో ఈ ఘనత సాధించిన మొదటి క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించి మన జిల్లాకు గర్వం కారణం. వివరాల్లోకి వెళ్ళితే ఇటీవల కెనడాలో జరిగిన అర్చరి క్రీడా పోటిల్లో తానిపర్తి చికిత పాల్గోని ప్రపంచ స్థాయి విజేతగా నిలిచి భారత దేశ కీర్తిని నిలబెట్టింది. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్ పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత అర్చరి క్రీడాకారిణిగా రాణించి భారత తొలి క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. సుల్తాన్ పూర్ గ్రామంలో వ్యవసాయం చేసుకునే తానిపర్తి శ్రీలత - శ్రీనివాస్ రావు దంపతుల కూతురు చికిత, కుమారుడు యస్వంత్ లు ఉన్నారు. చికిత కరీంనగర్ ఉమ్మడి జిల్లా నగునూరులోని ఎస్ పిఆర్ పాఠశాలలో 10 వ తరగతి, పెద్దపల్లి జిల్లా గర్రెపల్లిలో ఇంటర్మీడియట్, పంజాబ్ లోని ఎల్ పి యూనివర్ సిటీ లో డిగ్రీ చదువుతున్నది. బాల్యం నుంచి చదువుతో పాటు క్రీడాల పట్ల మక్కువ పెంచుకోని అర్చరి పోటీలు జరుగుతున్నపుడు, నేరుగా చూడడంతో పాటు టివిల్లో చూసి ఆ క్రీడాపట్ల ఆసక్తి పెంచుకుంది. ఎలాగైనా ఈ విల్లు క్రీడాను నేర్చుకొని ఉన్నత స్థాయిలో రాణించాలని పట్టుదలతో కరీంనగర్ లోని సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో శిక్షణ పొందింది. కృషి పట్టుదలతో అర్చరి క్రీడలో నైపుణ్యం పొంది రెండు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని రజత, కాంస్య పథకాలను సాధించింది. ఈ ఏడాదిలో జరిగిన ఆసియా కప్ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో పత కాన్ని కోల్పోయింది. కాగా ఈనెల 24న కెనడాలో జరిగిన ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్షిప్ కాంపౌండ్ విభాగం అండర్ - 21 లో ప్రత్యర్థులను మట్టికరిపించి బంగారు పతకం సాధించి విశ్వ విజేతగా నిలిచింది. అర్చరి క్రీడా విభాగంలో భారత్ కు తొలి బంగారు పథకాన్ని సాధించి దేశ ప్రతిష్ట ను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన చికితను దేశ ప్రజలు అభినందిస్తున్నారు. అలాగే ఓ మారుమూల గ్రామమైన సుల్తాన్ పూర్ బిడ్డ చికిత వల్ల ప్రపంచ దేశాల్లో నిలిచిందని గ్రామ ప్రజలు ఆనందాన్ని వ్యక్త పరుస్తున్నారు. కాగా అదే కుటుంబంలోని చికిత సోదరుడు యశ్వంత్ అర్చరి క్రీడాలో జాతీయ స్థాయిలో రానిస్తూ జిల్లా, మండలానికి గుర్తింపు తీసుకు వస్తున్నారు. క్రీడా కోటలో యస్వంత్ బాసర లోని త్రిపుల్ ఐటిలో సీట్ సాధించి విద్యా ను అభ్యశిస్తున్నాడు. గ్రామాల్లోకి ఇలాంటి ఆణిముత్యాలను వెతికి మరింత మందిని ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

# భారీగా తగ్గనున్న ధరలు

హైదరాబాద్, ఆగస్టు 26, ఈ సారి ప్రజలు డబుల్ దీపావళి జరుపుకుంటారని స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ అన్నారు. జీఎస్టీ విధానంలో కీలక సంస్కరణలు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం కానుంది. ఈ సమావేశంలో వివిధ వస్తువులు, సేవలపై పన్ను రేట్లను తగ్గించడంపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సమావేశంలో తీసుకునే ముఖ్యమైన నిర్ణయాలు ప్రజలకు భారీ ఊరటనిచ్చే అవకాశం ఉంది.సిమెంట్‌పై జీఎస్టీ తగ్గింపు: సిమెంట్‌పై ప్రస్తుతం ఉన్న 28శాతం జీఎస్టీ రేటును 18శాతానికి తగ్గించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ఈ తగ్గింపు నిర్మాణ రంగానికి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఊతమిస్తుంది. వినియోగదారులకు కూడా ఇళ్ల నిర్మాణం మరింత చౌకగా మారే అవకాశం ఉంది.: వ్యక్తులు కొనుగోలు చేసే టర్మ్ ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీని సున్నాకి తగ్గించే ప్రతిపాదన కూడా కౌన్సిల్ ముందుకు రానుంది. ఈ చర్య ఆరోగ్య బీమాను ప్రోత్సహించి, దేశంలో బీమా పరిధిని పెంచేందుకు తోడ్పడుతుంది. ప్రస్తుతం మధ్యస్థం నుండి హై-ఎండ్ సెలూన్‌లపై విధించే 18శాతం జీఎస్టీని 5శాతానికి తగ్గించవచ్చని భావిస్తున్నారు. ఈ మార్పు సాధారణ ప్రజలకు సెలూన్ సర్వీసులను మరింత అందుబాటులోకి తీసుకొస్తుంది ఆహార, వస్త్ర వస్తువులన్నింటినీ 5శాం పన్ను శ్లాబ్‌లోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. ఇది ఆహార, వస్త్ర పరిశ్రమలలో వర్గీకరణ సమస్యలను తొలగించి, పన్ను విధానాన్ని మరింత సులభతరం చేస్తుంది.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో జీఎస్టీ వ్యవస్థను పూర్తిగా పునఃపరిశీలించే అవకాశం ఉంది. వివిధ పన్ను శ్లాబ్‌లను కేవలం రెండు ప్రధాన శ్లాబ్‌లుగా ఏకీకృతం చేయాలని కౌన్సిల్ భావిస్తోంది. కొన్ని విలాసవంతమైన వస్తువులపై 40శాతం పన్ను కొనసాగించవచ్చు.ఈ ప్రతిపాదనలు జీఎస్టీ వ్యవస్థను సరళీకృతం చేసి, పన్ను విధానంపై ఉన్న గందరగోళాన్ని తగ్గించడానికి ఉపయోగపడనున్నాయి. అయితే పశ్చిమ బెంగాల్ వంటి కొన్ని రాష్ట్రాలు 40శాం పన్ను పరిమితిని మరింత పెంచాలని కోరాయి. కానీ అధికారులు ఇది చట్టపరమైన సవరణలను కోరుతుందని, ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. 8ఏళ్ల క్రితం జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పన్ను వ్యవస్థను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వినియోగదారులకు, ప్రభుత్వానికి ప్రయోజనం కలిగేలా సమతుల్యం చేయడానికి ఈ సమావేశం ఒక ముఖ్యమైన వేదిక కానుంది. ఈ నిర్ణయాలన్నీ అమలైతే, ప్రజలకు ధరల భారం తగ్గే అవకాశం ఉంది

# సెకండరీ టారిఫ్ లు

ముంబై, ఆగస్టు 26, దేశంలోని 140 కోట్ల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, 'బెస్ట్ డీల్' ఉన్న చోట నుంచే చమురు కొనుగోలును భారత్ కొనసాగిస్తుందని రష్యాలోని భారత రాయబారి వినయ్ కుమార్ స్పష్టం చేశారు.రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై డోనల్డ్ ట్రంప్ 25 శాతం పెనాల్టీతో కలిపి విధించిన 50 శాతం టారిఫ్‌ల అమలుకు కొన్ని రోజుల ముందు వినయ్ కుమార్ ఈ ప్రకటన చేశారు.రష్యాపై ఆర్థిక ఒత్తిడి తీసుకురావడానికి, యుక్రెయిన్‌తో యుద్ధం ఆపేలా ఒత్తిడి పెంచడానికి భారత్‌పై ట్రంప్ సెకండరీ టారిఫ్‌లు (నేరుగా రష్యాపై కాకుండా, ఆ దేశంతో వ్యాపారం చేసే ఇతర దేశాలపై సుంకాలు విధించడం) విధించారని సోమవారం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు.ఈ యుద్ధం మొదలైనప్పటి నుంచి రష్యా చౌక ముడి చమురును భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకోవడంతో భారత్, అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. వాణిజ్య ఒప్పందం చర్చలు కూడా దీనివల్ల ప్రభావితమయ్యాయి.భారత చమురు దిగుమతుల్లో రష్యా క్రూడాయిల్ వాటా 2021లో 3 శాతం ఉండగా, 2024లో 35-40 శాతానికి పెరిగింది.రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం వల్ల యుక్రెయిన్‌పై యుద్ధానికి రష్యాకు నిధులు సమకూరేందుకు భారత్ సహకరిస్తోందంటూ అమెరికా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణను భారత్ ఖండిస్తోంది.భారత వాణిజ్యం, మార్కెట్ అంశాలపై అధారపడి ఉందని, దేశ ప్రజల ఇంధన భద్రతకే కట్టుబడి ఉందని సోమవారం రష్యా న్యూస్ ఏజెన్సీ టాస్‌తో వినయ్ కుమార్ అన్నారు.భారత్‌పై ట్రంప్ సెకండరీ టారిఫ్‌ల విధింపు 'అన్యాయం, అహేతుకం, అసమంజసం' అని ఆయన పునరుద్ఘాటించారు.రష్యా క్రూడాయిల్‌ను భారత్ కొనుగోలు చేయడాన్ని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ గట్టిగా సమర్థించారు. ఆ తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే వినయ్ కుమార్ నుంచి ఈ ప్రకటన వచ్చింది.వాణిజ్యానికి అనుకూలంగా ఉన్న అమెరికా పాలకవర్గంలో పనిచేసే వ్యక్తులే ఇతరులు వ్యాపారం చేస్తున్నారంటూ ఆరోపించడం హాస్యాస్పదంగా ఉంది. ఇంకా చెప్పాలంటే, రష్యా చమురుకు అతిపెద్ద దిగుమతిదారు అయిన చైనా, రష్యాతో పెద్ద ఎత్తున వాణిజ్యం చేస్తున్న యూరోపియన్ యూనియన్‌పై ట్రంప్ సెకండరీ టారిఫ్‌లు విధించలేదు. భారత్ వ్యూహాత్మకంగానే నిర్ణయాలు తీసుకుంటుంది. అమెరికా ఒత్తిడికి తలొగ్గదు" అని ఆయన చెప్పారు.భారత్‌కు అత్యంత ముఖ్య మిత్రదేశాల్లో రష్యా ఒకటి కాగా, యుక్రెయిన్‌తో కూడా భారత్ స్నేహపూర్వక సంబంధాలనే కొనసాగిస్తోంది.రష్యా-యుక్రెయిన్ యుద్ధానికి చర్చలు, దౌత్యం ద్వారా శాంతిపూర్వక పరిష్కారం దిశగా పనిచేయాలని భారత్ పదే పదే చెబుతోంది.

అయితే, పశ్చిమ దేశాల నుంచి ఒత్తిడి ఉన్నప్పటికీ రష్యాను బహిరంగంగా భారత్ ఇప్పటివరకు ఖండించలేదు.ప్రధాని నరేంద్ర మోదీ 2024లో యుక్రెయిన్‌ను సందర్శించారు. వీలైనంత త్వరగా శాంతిని పునరుద్ధరించేందుకు అన్ని విధాలుగా సహకరించేందుకు భారత్ తమ సంసిద్ధతను వ్యక్తం చేసింది.యుక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలియన్‌స్కీ త్వరలోనే భారత్‌కు రావొచ్చని, తేదీలు ఇంకా ఖరారు కాలేదని సోమవారం స్థానిక మీడియాతో భారత్‌లోని యుక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పోలిష్చుక్ చెప్పారు.రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ కూడా ఈ ఏడాది భారత్‌కు వచ్చే అవకాశం ఉంది.యుక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపేందుకు ట్రంప్ ప్రయత్నాలపై వాన్స్ విశ్వాసం వ్యక్తం చేశారు.'ఒకవేళ ఈ హత్యలను ఆపేస్తే రష్యాను తిరిగి ఈ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోకి ఆహ్వానించే అవకాశం ఉందని ట్రంప్ చెప్పేందుకు ప్రయత్నించారు. అయితే, వాళ్లు ఈ హత్యలను ఆపకపోతే ఇలాగే ఒంటరిగానే మిగిలిపోతారు" అని వాన్స్ వ్యాఖ్యానించారు

# బై పోల్ మూడ్ లోకి గులాబీ దళం




హైదరాబాద్, ఆగస్టు 26,బీఆర్ఎస్ బై పోల్ మూడ్‌లోకి వచ్చేసిందా? అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలుపెట్టిందా? ఎప్పుడు సైరన్ మోగినా మేము సై అంటూ సిద్ధమైపోతోందా? అసలిప్పుడు ఎందుకు హడావిడి చేస్తోంది కారు పార్టీ? ఏ ఉప ఎన్నికల కోసం సిద్ధమవుతోంది. జూబ్లీహిల్స్ తప్ప మిగతా చోట్ల ఇప్పటికిప్పుడు ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందా? గులాబీ లెక్కలేంటి? 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీ ఫామ్ మీద గెలిచి? తర్వాత కాంగ్రెస్‌లోకి జంప్ అయిపోయారు పది మంది ఎమ్మెల్యేలు. వాళ్ళ మీద అనర్హత వేటు వేయాలంటూ అసెంబ్లీ స్పీకర్‌ని కోరింది బీఆర్ఎస్. ఆ పోరాటంలో భాగంగా సుప్రీం కోర్ట్ దాకా వెళ్ళింది. తాజాగా వచ్చిన తీర్పు తమకు అనుకూలంగా ఉన్నట్టు భావిస్తున్నారు గులాబీ నేతలు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల సంగతిని మూడు నెలల్లోగా తేల్చమని స్పీకర్‌కు సూచించింది సుప్రీమ్ కోర్ట్. అందులో భాగంగా కొందరు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు బీఆర్ఎస్ లీడర్స్. మరి కొంత మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా త్వరలో నోటీసులు అందుకోబోతున్నారంటూ ప్రచారం చేస్తున్నారు. ఇదంతా చూస్తుంటే? వాళ్ళ మీద ఖచ్చితంగా అనర్హత పడుతుందని కారు పార్టీ గట్టిగా నమ్ముతున్నట్టుందని అంటున్నారు పరిశీలకులు. నిజంగానే అనర్హత వేటు పడితే.. ఆ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయం. అవి కూడా ఎంతో దూరంలో లేవని, జూబ్లీహిల్స్ బైపోల్‌తో పాటే జరుగుతాయని నమ్ముతోందట కారు పార్టీ అధిష్టానం. అందుకే ఆయా నియోజకవర్గాల మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టబోతున్నట్టు సమాచారం.పార్టీ మారిపోయిన ఎమ్మెల్యేలకు ప్రత్యామ్నాయ నేతల్ని సిద్ధం చేసే కార్యక్రమం మొదలైపోయిందట. అందులో భాగంగానే? గెలుపు గుర్రాల కోసం అన్వేషణ మొదలైనట్టు తెలిసింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ గాలి వీచినా?. ఆయా నియోజకవర్గాల్లో తమ పార్టీ గెలిచింది కాబట్టి?.ఇప్పుడు ఉప ఎన్నికలంటూ జరిగితే? తిరిగి దతమ ఖాతాలోనే పడిపోతాయన్నది బీఆర్ఎస్ పెద్దల నమ్మకం అట. ఈసారి టిక్కెట్స్‌ను అధిష్టానానికి దగ్గరగా ఉన్న వాళ్లకి, గెలిచాక కూడా పక్క చూపులు చూడని వాళ్ళకు ఇవ్వాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. పది నియోజకవర్గాల్లో అలాంటి వాళ్ళు ఎవరున్నారని వెదుకుతున్నారట. శేరిలింగంపల్లిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పటాన్‌చెరులో ఆదర్శ్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్‌లో మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య, ఖైరతాబాద్ నుంచి మన్నే గోవర్ధన్ రెడ్డి, రాజేంద్రనగర్‌లో సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి, జగిత్యాలలోఎమ్మెల్సీ ఎల్ రమణ, బాన్సువాడ నుంచి ఆర్టీసీ మాజీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, గద్వాలలో హనుమంతు నాయుడు లేదా కాంగ్రెలో ఉన్న వారిని లాక్కునే అవకాశం ఉందని అంటున్నారు.ఇక భద్రాచలంలో రేగా కాంతారావుకు, చేవెళ్ల నుంచి కొత్త వారికి టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఇక వీళ్లు మాత్రమే కాకుండా? ఉప ఎన్నికలంటూ జరిగితే ఆ టైంకి కాంగ్రెస్ నుంచి గానీ లేకుంటే వేరే పార్టీల నుంచి బలమైన నాయకులు ఎవరైనా ఆసక్తిగా ఉంటే వాళ్ళనుగాని చేర్చుకుని గెలిపించుకునేలా ప్లాన్ చేస్తోందట బీఆర్ఎస్ అధిష్టానం. వాళ్ళు ఊహిస్తున్నట్టుగా?ఒకవేళ ఈ 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరిగితే మాత్రం? ఆ ఫైట్ అసెంబ్లీ సాధారణ ఎన్నికల్ని మించి పోతుంది. అందుకే ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెడుతున్నారట. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించుకుంటూ? అక్కడ ఇన్చార్జ్‌లను నియమిస్తూ? క్యాడర్ ను ఉత్తేజపరచాలని చూస్తున్నారట. ఒకవేళ స్పీకర్ నిర్ణయం తీసుకొని వాళ్లపై అనర్హత వేటు వేస్తే? ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి. ముందుగానే అలర్ట్ అవుతోందట గులాబీ పార్టీ.

# విజయ్ కు నెటజన్లు సెటైర్లు

చెన్నై, ఆగస్టు 26, త్వరలో తమిళనాడు రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పటికే ఆ రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొంది. ప్రధాన పార్టీలు ఇప్పటికే పరోక్షంగా ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టాయి. అధికార డిఎంకె సోషల్ మీడియాలో గొప్పగా ప్రచారం చేసుకుంటున్నది. భారీగానే సభలు పెడుతూ హంగామా సృష్టిస్తున్నది. మరోవైపు బిజెపి కూడా తగ్గేది లేదు అన్నట్టుగా ప్రచారం మొదలుపెట్టింది. కాంగ్రెస్ డిఎంకెలో భాగస్వామ్య పార్టీ కాబట్టి.. డీఎంకే నిర్వహిస్తున్న సభల్లో పాల్గొంటున్నది. ఇక ఇటీవల టీవీకే పేరుతో పార్టీ పెట్టిన సినీ నటుడు విజయ్.. తన పార్టీ కార్యక్రమాలను వేగవంత చేసారు. ఇటీవల మధురైలో మానాడు పేరుతో భారీ సభ నిర్వహించారు. ఈ సభకు లక్షలలో జనం తరలివచ్చారు.తమిళనాడు రాజకీయాలను మార్చేస్తానని.. అధికారం కోసం అడ్డదారులు తొక్కనని.. సొంతంగానే అధికారంలోకి వస్తామని.. ప్రజలకు అలవికాని హామీలు ఇచ్చి మోసం చేయలేనని విజయ్ ప్రకటించారు. తమిళనాడు అభివృద్ధికి.. తమిళనాడు ఉన్నతి కి ఏం చేయాలో తనకు తెలుసని విజయ్ పేర్కొన్నారు. విజయ్ నిర్వహించిన సభకు భారీగా జనం రావడంతో టీవీకే పార్టీ కార్యకర్తల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆ పార్టీలోకి ఇతర పార్టీల నుంచి నాయకులు చేరిపోతున్నారు. ఇది ఎంతవరకు తమిళనాడు రాజకీయాలను ప్రభావితం చేస్తుంది.. విజయ్ ముఖ్యమంత్రి అవుతారా.. అనే విశ్లేషణలు అక్కడి రాజకీయాలలో జోరుగా సాగుతున్నాయి. ఇది ఎంతవరకు వాస్తవరూపం దాల్చుతుందో తెలియదు గానీ.. మధురై మానాడుకు సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది.మధురై మానాడులో భారీగా జనం రావడంతో విపరీతంగా ప్లాస్టిక్ పేరుకుపోయింది. కుర్చీలను ఎక్కడికక్కడే విరగొట్టారు. ప్లాస్టిక్ బాటిల్స్ తో మానాడు జరిగిన ప్రాంతం మొత్తం అత్యంత దుర్గంధపూరితంగా మారింది. ఫ్లెక్సీలు.. విరిగిన కటౌట్లు? ఆహార ప్యాకెట్లు.. తెగిన పాదరక్షలు.. ఇంత చెత్తతో ఆ ప్రాంతం మొత్తం డంపింగ్ యార్డ్ ను తలపిస్తోంది. దీనికి సంబంధించిన వీడియోలను డీఎంకే పార్టీ నాయకులు సోషల్ మీడియాలో సర్కులేట్ చేస్తున్నారు.. తమిళనాడులో తర్వాత మారుద్దువు గాని.. ముందు ఈ చెత్త సంగతి ఏమిటంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు విజయ్ ని ఉద్దేశించి ప్రశ్నిస్తున్నారు.



# క్షేత్రస్థాయి పటిష్ఠత పై జనసేన దృష్టి

విశాఖపట్టణం, ఆగస్టు 26,జనసేన పార్టీ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సిద్ధమవుతుంది. అందుకే విశాఖలో మూడు రోజులపాటు విస్తృత స్థాయిసమావేశం నిర్వహిస్తున్నారు.ఆగస్ట్ 28వ తేదీ నుంచి 30వ తేదీవరకు మూడు రోజులు విస్తృత స్థాయి సమావేశం విశాఖ లో నిర్వాహిస్తున్నారు. ఈ మూడు రోజులు పాటు సేనతో సేనాని పేరిట జరిగే కార్యక్రమంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారు. 28వ తేదీన జనసేన లెజిస్టేటివ్ పార్టీ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో జనసేన ఎమ్మెల్యేల నుంచి పవన్ కల్యాణ్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. పార్టీ క్షేత్రస్థాయిలో ఎలా ఉంది? కూటమి పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై ఎమ్మెల్యే అభిప్రాయాలను తెలుసుకుంటారు.టీడీపీ ప్రతి ఏటా నిర్వహించిన మహానాడు తరహాలో ఈ సమావేశాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. అలాగే జనసేన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో అధికారులు తమ మాట వినడం లేదని ఎప్పటి నుంచో ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. తాము ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ తమ మాట వినకుండా టీడీపీ ఇన్ ఛార్జుల మాటకే విలువ ఇస్తున్నారని, నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ జనసేనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఇటీవల తరచూ ఎమ్మెల్యేలు చెబుతుండటంతో 28వ తేదీన జరిగే లెజిస్టేటివ్ సమావేశంలో దీనిపై కూలంకషంగా చర్చించే అవకాశముంది. ఎక్కడెక్కడ ఇబ్బందులున్నాయో తెలుసుకుని వాటిని టీడీపీ అధినేత చంద్రబాబు ముందు ఉంచే ప్రయత్నంలో భాగంగా ఈ సమావేశాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిసింది ఈతరం నేతలను గాడిన తేవడం కష్టమేనా? పార్లమెంటు నియోజకవర్గాల వారీగా... 28వ తేదీ మధ్యాహ్నం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. ఆగస్ట్ 29వ తేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు పార్లిమెంట్ నియోజక వర్గాల వారిగా పదిమంది పార్టీ నేతలతో చర్చిస్తారు. అనంతరం పర్యావరణం , మహిళా బాధ్యత పై రక్షిత మంచినీటి పథకం, ఉపాధి క్షల్పన,మీద చర్చలు ఉంటాయి. కొత్త నాయకత్వం బయటకు వచ్చేలా ప్రోత్సహించేందుకే ఈ రకమైన సమావేశాలు అని జనసేన చెబుతుంది. విపక్షం సోషల్ మీడియా వినియోగించి చేసిన దుష్ప్రచారంపై కూడా చర్చిస్తారు. ఏడాది నుంచి అందించిన సుపరిపాలన మీద చర్చ జరుగుతుంది. ఎన్నికలు గడిచి పథ్నాలుగు నెలలు కావడంతో ఇప్పటి వరకు పార్టీ శ్రేణులతో గడిపే సమయం లేకపోవడం తో ఇప్పుడు ఈ కార్యక్రమంతో పార్టీ నాయకులు, కార్య కర్తలతో పవన్ కళ్యాణ్ కలిసి ఉ ంటారు. ఈ నెల 30 వ తేదీ జనసేన మహా సభ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సభ ప్రారంభమవుతుంది. సాయంత్రం 6 గంటలకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రసంగం ఉంటుంది.ఇప్పటికే సేనతో సేనాని కార్యక్రమ పోస్టర్ ను మంత్రి నాదెండ్ల మనోహర్ విడుదల చేశారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లను నాదెండ్ల పరిశీలించారు. క్యాడర్ లో ఉన్న అసంతృప్తిని పోగొట్టడానికి, కొత్త నాయకత్వాన్ని ఆహ్వానించడానికి, పార్టీలో, ప్రభుత్వంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని జనసేన నేతలు చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ స్వయంగా హాజరయి క్యాడర్, ఇబ్బందులను విని వాటిని తొలగించే ప్రయత్నం చేస్తారని నమ్ముతున్నారు.

# రాయలసీమలో వజ్రాల వేట..




కర్నూలు, ఆగస్టు 26, రాయలసీమ ప్రాంతంలో కురిసిన వర్షాలు కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రజల అదృష్టాన్ని పరీక్షించే సమయంగా మారాయి! ఖరీఫ్ సాగుతో పాటు ఇక్కడ వజ్రాల వేట కూడా జోరుగా సాగుతోంది. జొన్నగిరి, తుగ్గలి, పెరవలి మండలాల్లో వజ్రాలు దొరుకుతాయనే ప్రచారం ఎప్పటినుంచో ఉంది. ఈ వర్షాలకు భూమి తడిసి, విలువైన రాళ్లు పైకి తేలుతాయన్న మాటలతో.. స్థానికులు, వ్యాపారులు, ఇతర ప్రాంతాల నుంచి వజ్రాల వేటకు వస్తున్నారు."ఒక్క రాయి దొరికినా మీ అదృష్టవే మారిపోతుంది" అని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యాపారవేత్త భరత్ పలోద్ అన్నారు. సాధారణ రైతులు కూడా కోటీశ్వరులైన కథలు ఈ ప్రాంతంలో ఎంతో మందికి స్ఫూర్తినిచ్చాయని ఆయన తెలిపారు. పలోద్ స్వయంగా 2018లో తొలి వజ్రాన్ని కనుగొన్నారు. ఈ ఏడాది మరొక వజ్రాన్ని రూ. 8 లక్షలకు అమ్ముకున్నానని చెప్పారు.సామాజిక కార్యకర్త దీపికా దుసకంటి గతంలో రూ. 5 లక్షల విలువైన వజ్రాన్ని అమ్మి, ఆ డబ్బుతో పేద పిల్లల చదువుకు సాయం చేసినట్లు గుర్తు చేసుకున్నారు."ఈసారి రూ. 10 లక్షల విలువైన వజ్రం దొరికింది. దీన్ని కూడా విద్యార్థుల కోసమే ఉపయోగిస్తాను," అని ఆమె తెలిపారు.వజ్రాలు దొరుకుతున్న వీడియోలు చూసి జొన్నలగిరికి వచ్చానని చిత్తూరుకు చెందిన రైతు గోదావరమ్మ చెప్పారు. "నేను ఆలస్యంగా వచ్చినా, వెతుకులాట కొనసాగిస్తాను. ఒక్కటి దొరికినా మా కుటుంబానికి సాయం అవుతుంది," అని ఆమె అన్నారు.కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ.. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వజ్రాల గురించి అనేక కథలు ఉన్నాయన్నారు. "ప్రజలు పని కోసం వలస వెళ్లి, వర్షాకాలంలో తిరిగి వచ్చి వజ్రాల వేటలో పాల్గొంటారు. ఇంత పెద్ద మొత్తంలో వజ్రాల వేట సాగుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నేరాలు నమోదు కాలేదు," అని ఆయన తెలిపారు. భూమిని తమదని చెప్పుకుని బయటివారిని అడ్డుకున్న సందర్భాలు ఉన్నప్పటికీ, పెద్దగా గొడవలు లేదా నేరాలకు సంబంధించిన సంఘటనలు జరగలేదని ప్రవీణ్ పేర్కొన్నారు.ఈ సీజన్‌లో చాలా విలువైన వజ్రాలు దొరికినట్లు వార్తలు రావడంతో మరింత ఉత్సాహం పెరిగింది. పెరవలి గ్రామానికి చెందిన వెంకటేశ్వర రెడ్డి అనే కూలీకి దొరికిన వజ్రాన్ని స్థానిక వ్యాపారికి రూ. 15 లక్షలకు అమ్ముకున్నాడని సమాచారం. అనంతపురం జిల్లాలో 40 ఎకరాలకు పైగా భూమి ఉన్న పీ బజరంగలాల్, తన భూమిలో వజ్రాల వేటకు అభ్యంతరం లేదని చెప్పారు. చాలామందికి ఇక్కడ వజ్రాలు దొరికాయని, వారికి తాగునీరు, ఆహారం కూడా అందిస్తున్నట్లు తెలిపారు. "ఈ వజ్రాలు ఇతరుల జీవితాల్లో సంతోషం తెస్తే, నేను పూర్తిగా మద్దతు ఇస్తాను," అని ఆయన అన్నారు.కర్నూలు జిల్లా మద్దికేర మండలానికి చెందిన శ్రీనివాసులు అనే రైతుకు రూ. 2 కోట్లు విలువ చేసే అరుదైన వజ్రం దొరికినట్లు, అది సిండికేట్‌కు చెందిన వ్యాపారులకు అమ్ముకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ ఏడాది దొరికిన వజ్రాల్లో ఇదే అత్యంత విలువైనదని అధికారులు తెలిపారు. తుగ్గలి మండలం చింతలకొండ గ్రామంలో ప్రసన్న అనే మహిళ తన పొలంలో దున్నుతుండగా మెరిసే రాయి దొరికింది. దానిని స్థానిక వ్యాపారికి రూ. 13.5 లక్షలకు అమ్మింది. ఈ విషయం ఆమె కుటుంబానికే కాకుండా గ్రామంలోని అందరికీ ఆనందాన్ని ఇచ్చిందని గ్రామస్తులు తెలిపారు.జొన్నగిరి, పాగిదిరాయి, ఎర్రగుడి, ఉప్పర్లపల్లి వంటి ప్రాంతాల్లో వజ్రాల వేట వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుంది. భారీ వర్షాల కారణంగా భూమిలోపల ఉన్న రాళ్లు బయటపడతాయని అంటూ ఉంటారు. అయితే చాలామంది ఖాళీ చేతులతోనే తిరిగి వెళ్తారు. అయినా అప్పుడప్పుడు దొరికే వజ్రాలు వేలాది మందికి స్ఫూర్తిని ఇస్తుంటాయి.కొన్ని సిండికేట్‌లు వజ్రం నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేసి, తక్కువ ధరకు కొనేందుకు ప్రయత్నిస్తాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిని ఎదుర్కోవడానికి కొంతమంది స్థానికులు ఆన్‌లైన్ వేలం లేదా సోషల్ మీడియాలో తమ వజ్రాలను యాడ్స్? రూపంలో పెట్టి మెరుగైన ధరలను పొందుతున్నారు. ఈ వ్యాపారంపై ప్రభుత్వం ఎలాంటి నిబంధనలను రూపొందించలేదు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఉన్నప్పుడు వజ్రాలకు ఎందుకు ఉండకూడదని పలువురు వంటి రైతులు ప్రశ్నిస్తున్నారు.ఈ వజ్రాల వేట శతాబ్దాల చరిత్రను కలిగి ఉంది. విజయనగర రాజుల ఖజానాలోకి రాయలసీమలో దొరికిన వజ్రాలు వెళ్లాయని జానపద కథలు చెబుతున్నాయి. ఈ వజ్రాల వేట కేవలం డబ్బు సంపాదించడం మాత్రమే కాకుండా, ఈ ప్రాంత ప్రజల జీవన శైలిలో ఒక భాగం అయింది. వలస వెళ్లిన కుటుంబాలు.. వర్షం పడగానే తిరిగి వచ్చి అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి. అధికారులు దీనిని ఒక రకమైన "వజ్రాల వ్యవసాయం" అని పిలుస్తున్నారు. కఠినమైన భూభాగంలో, అదృష్టం, విశ్వాసం, పట్టుదలపై ఆధారపడిన ఈ వజ్రాల వేట, ఈ ప్రాంతంలో ఒక ప్రత్యేకమైన సాంప్రదాయంగా కొనసాగుతోంది.

# యూరియా సరఫరాపై విజిలెన్స్ నిఘా

విజయవాడ, ఆగస్టు 26, ఏపీలో పలుచోట్ల యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదే విషయంపై రాష్ట్ర వ్యవసాయశాఖ ఫోకస్ పెట్టింది. యూరియా కొరత రానివ్వకుండా చర్యలు చేపట్టామని వెల్లడించింది. విజిలెన్స్ నిఘా ఏర్పాటు చేశామని? జిల్లాల వారీ మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపింది.తెలుగు రాష్ట్రాల్లో యూరియా సరఫరా విషయంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇరు ప్రభుత్వాలు కూడా యూరియా సరఫరా విషయంలో ఎప్పటికప్పుడు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాయి. యూరియా కొరత లేకుండా తక్షణమే సరఫరా చేయాలని కోరుతున్నాయి.యూరియా సరఫరా విషయంలో రైతులెవరూ ఆందోళన చెందొద్దని వ్యవసాయ శాఖ తెలిపింది. అవసరానికి మించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. గత ఖరీఫ్ సీజన్ కంటే ప్రస్తుత ఖరీఫ్ సీజన్లోనే ఎరువులను ఎక్కువగా సరఫరా చేశామని పేర్కొంది. రైతుల ఎరువుల అవసరాలను తీర్చేందుకు... సమయానికి, సమృద్ధిగా ఎరువులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పని చేస్తోందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది.క్షేత్రస్థాయిలో యూరియా, ఎరువుల కొరత లేకుండా ఉండేలా విజిలెన్స్ నిఘా పెట్టింది.2025 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగింది.గత ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 8,76,928 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, ఈ సంవత్సరం అదే కాలానికి 10,96,239 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగమయ్యాయి.గత సంవత్సరం కంటే 2,19,311 మెట్రిక్ టన్నులు అధికంగా ఎరువులను రైతులు కొనుగోలు చేశారు.యూరియా వినియోగం 2024లో 3,74,290 మెట్రిక్ టన్నుల నుంచి ఈసారి 4,57,727 మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఇది 83,436 మెట్రిక్ టన్నుల అధిక వినియోగాన్ని సూచిస్తోందని వ్యవసాయ శాఖ వెల్లడించింది.డీఏపీ వినియోగం 1,17,582 మెట్రిక్ టన్నుల నుంచి 1,37,884 మెట్రిక్ టన్నులకు పెరిగింది.పొటాష్ వినియోగం 39,054 మెట్రిక్ టన్నుల నుంచి 54,276 మెట్రిక్ టన్నులకు పెరిగి 15,222 మెట్రిక్ టన్నుల మేర పెరిగింది.యూరియా, ఎరువుల కొరత రాకుండా నెలవారీ సరఫరా ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ తాజాగా వెల్లడించింది. కొందరు రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేస్తున్నారని? దీని వల్ల ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.రైతులకు మరింత భరోసా కల్పించేలా మార్క్ ఫెడ్ కు ఎరువుల కేటాయింపులను పెంచుతున్నామని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. అందుబాటులో ఉన్న ఎరువుల్లో ఇకపై 70 శాతం ఎరువులను మార్క్ ఫెడ్ కు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బ్లాక్ మార్కెట్టుకు తరలించిన వారిపై కేసులు పెట్టాలని.. ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు.అలాంటి వారిపై కఠిన చర్యలు – సీఎం చంద్రబాబురాష్ట్రంలో ఎరువులు, పురుగుమందుల లభ్యత, సరఫరా అంశంపైనా సీఎం చంద్రబాబు సమీక్ష చేశారు. ఎరువుల కొరత అనే సమస్య లేకుండా అధికార యంత్రాంగం పనిచేయాలని సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిలెన్స్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎరువులు దారి మళ్లకుండా, ధర పెరగకుండా చూడాలని సీఎం సూచించారు. ఎరువుల కొరత అనే సమస్య ఉ న్నట్లు ఎక్కడ నుంచి సమాచారం వచ్చినా...రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు.

# లేడీ డాన్ అరుణ..

## పెరోల్ లో చేతులు మారిన 2 కోట్లు



నెల్లూరు, ఆగస్టు 26, అంతా శాఖాహారులే?.. కానీ? బుట్టలోని రొయ్యలు మాత్రం మాయం. ప్రస్తుతం రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ ఎపిసోడ్‌కు ఈ సామెత సరిగ్గా సరిపోతుందంటున్నారు పొలిటికల్ పండిట్స్. ఈ కేసుకు సంబంధించి పేర్లు బయటికి వచ్చిన నేతలంతా? మాకు సంబంధం లేదంటే మాకు లేదంటున్నారు. కానీ? పెరోల్ మాత్రం వచ్చింది, రచ్చ అయ్యాక మళ్లీ శ్రీకాంత్‌ని లోపలికి నెట్టారు. కానీ.. ఇక్కడ అసలు దోషులెవరన్నది బిగ్ క్వశ్చన్. ఒక హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న, అంతకు ముందు కూడా నేర చరిత్ర ఉన్న వ్యక్తిని పెరోల్ మీద బయటికి తీసుకువచ్చి? అతనితో ఏం చేయిద్దామనుకున్నారన్నది మిలియన్ డాలర్ క్వశ్చన్. ఒక రౌడీషీటర్‌కు అసలు రెండు సార్లు పెరోల్ ఎందుకు ఇచ్చారు? ఈ ప్రభుత్వంలోని ఇద్దరు ఎమ్మెల్యేలు ఎలా సిఫారసు లేఖలు ఇచ్చారు? మానవతా దృక్పథంతో లెటర్ ఇచ్చామన్నదే వాళ్ళ సమాధానమైతే? ఒక కరుడుగట్టిన నేరస్తుడి మీద అంత మానవత్వం ఎందుకు ప్రదర్శించాల్సి వచ్చింది? మా సిఫారసు లేఖలు రిజెక్ట్ అయ్యాయని ఎమ్మెల్యేలు చెబుతున్నారు సరే? మరి పెరోల్ వచ్చేలా పావులు కదిపింది ఎవరు? హోంశాఖలో ఉన్నతాధికారులు పావులు కదిపారా? ఇందులో అసలు హోం మంత్రి అనిత పాత్ర ఎంతవరకు? ఆమె పెరోల్‌కి అనుమతి ఇచ్చారా లేదా? ఈ మొత్తం ఎపిసోడ్‌కు సంబంధించి ఇలాంటి చాలా ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. ఒకవేళ పెరోల్ వద్దని మంత్రి చెప్పి ఉంటే? ఆమె వద్దన్నా అదే డిపార్ట్‌మెంట్‌లో మినిస్టర్ మాట కాదని నేరస్తుడిని బయటికి తీసుకువచ్చింది ఎవరన్నది కూడా తేలాల్సి ఉంది.అసలు గూడూరు ఎమ్మెల్యే సునీల్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని పెరోల్ కోసం ఎవరు అప్రోచ్ అయ్యారన్న డౌట్స్ కూడా ఇప్పుడు పెరుగుతున్నాయట. శ్రీకాంత్ కుటుంబ సభ్యుల పేర్లను పైకి చెబుతున్నా? వాళ్ళని కూడా వెనక నుంచి ఏదో శక్తి డ్రైవ్ చేసిందన్న సందేహాలు పెరుగుతున్నాయి. శ్రీకాంత్ తండ్రి పెరోల్ కోసం తన దగ్గరకు వచ్చారని, అందుకే లెటర్ ఇచ్చానంటున్నారు కోటంరెడ్డి. అయినాసరే? తన సిఫారసు లేఖతో పెరోల్ రాలేదన్నది ఆయన వాదన. అదే నిజమనుకుంటే?. మరి పెరోల్ ఎలా వచ్చింది? తెర వెనక చక్రం తిప్పింది ఎవరన్నది మిస్టరీగా మారింది. ఒకవేళ శ్రీకాంత్ ప్రియురాలు నడిగంటి అరుణ పెరోల్ కోసం ఆ ఇద్దరు ఎమ్మెల్యేలను అప్రోచ్ అయిఉంటే?. ఆమెతో వాళ్ళకున్న సంబంధాలేంటన్న ప్రశ్నలు వస్తున్నాయి. వెనకున్న అదృశ్య శక్తి ఏదో?. శ్రీకాంత్‌ను పెరోల్ మీద బయటికి రప్పించి చేయకూడని పనులేవో చేయించాలనుకుందన్న చర్చ జరుగుతోంది పొలిటికల్ సర్కిల్స్‌లో. ఎమ్మెల్యేలు ఇద్దరూ పెరోల్ కోసం సిఫార్సు చేస్తే? విచారణ తరువాత హోమ్ మంత్రి అనిత వెనక్కి తగ్గారని, పెరోల్ అవసరం లేదని అన్నారని, ఆ తర్వాతే స్టోరీ మారిపోయిందన్నది ఇంకో వెర్షన్. హోమ్ మంత్రి తిరస్కరించిన వెంటనే? సీన్‌లోకి శ్రీకాంత్ లవర్?అరుణ ఎంటరైపోయి?.అనితతో చర్చలు జరిపిందన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి సచివాలయవర్గాల్లో. ఆ తర్వాతే పెరోల్ ఫైల్ ఉన్నతాధికారుల దగ్గరకు వెళ్ళి ఓకే అయిందని చెప్పుకుంటున్నారు. ఇక్కడే ఒక పెద్ద డౌట్ వస్తోందట అందరికీ. అసలు పెరోల్‌కు హోమ్ మంత్రి అనుమతి ఇచ్చారా? లేదా అన్నదే ఆ అనుమానం. మంత్రే పెరోల్‌కు రికమండ్ చేశారా? లేక ఫైల్ ఆమె దగ్గరి నుంచి వెళ్ళిపోయాక దాన్ని ఆసరా చేసుకుని? డిపార్ట్‌మెంట్‌లో ఉన్నతాధికారులు చక్రం తిప్పారా అన్న విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది.అదే నిజమైతే? రౌడీ షీటర్ పెరోల్‌కు తెర వెనక నుంచి సహకరించిన ఆ పోలీసు అధికారులెవరో తేలాల్సి ఉంది. ఇందులో? ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలున్నాయి? ఏ పనిమీద నేరస్తుడిని బయటకొచ్చారన్న చర్చ ఇప్పుడు ఏపీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సైతం తీవ్ర స్థాయిలో జరుగుతోంది. ఈ వ్యవహారంపై ముందు ఎవరూ మట్లాడొద్దని ఎంత కట్టడి చేసినా? పోలీస్ వర్గాల్లో కూడా చర్చ ఆగడం లేదు. హోమ్ శాఖలోని కీలక అధికారి, అలాగే? ప్రభుత్వంలోని అత్యంత ఉన్నతాధికారి నేతృత్వంలోనే పెరోల్ మంజూరైందన్న ప్రచారం జోరుగా జరుగుతోంది సచివాలయ వర్గాల్లో. ఆ పెద్ద ఉన్నతాధికారి హోమ్ శాఖ అధికారిని తన ఛాంబర్‌కు పిలిపించుకుని మరీ? పెరోల్ ఇమ్మన్నట్టు చెప్పుకుంటున్నారు. ఆ స్థాయిలో వచ్చిన రికమండేషన్ కారణంగానే? ఆఘమేఘాల మీద ఫైల్ కదిలి రౌడీ షీటర్ బయటికి వచ్చాడని మాట్లాడుకుంటున్నారు. ఆ? పెద్ద ఉన్నతాధికారికి, శ్రీకాంత్ లవర్ అరుణకు మధ్య అత్యంత సన్నిహిత సంబంధాలున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు రికమండ్ చేశాక పెరోల్ ఫైల్..ముందుకు వెళ్ళింది. కానీ? హోమ్ మంత్రి విచారణ తర్వాత ఆగింది. అదే సమయంలో ఉన్నతాధికారులు ఎంటర్ అయ్యారని, దీనికి సంబంధించి దాదాపు 2 కోట్ల రూపాయలు చేతులు మారాయన్న ప్రచారం ఉంది. అదే నిజమైతే? ఆ డబ్బు ఎవరికి చేరింది? ఇందులో హోమ్ మంత్రి, ఇతర అధికారుల పాత్ర ఎంత అన్న విషయమై హాట్ హాట్ చర్చ జరుగుతోంది. ప్రభుత్వంలో ఉన్న పెద్ద అధికారి పాత్ర ఇందులో ఉన్నట్టు వాసన రావడంతో? ఇటు సర్కార్ పెద్దలు కూడా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారట. మరింత లోతుగా అధ్యయనం చేస్తున్నట్టు తెలిసింది. మొత్తం మీద ఒక రౌడీ షీటర్‌కు పెరోల్ వ్యవహారం ఇప్పుడు ఏకంగా ఆంధ్రప్రదేశ్ సచివాలయాన్ని కూడా షేక్ చేస్తోంది.

# పీ4 కిందకు 13 లక్షల కుటుంబాలు

విజయవాడ, ఆగస్టు 26ఈ ఏడాది ఉగాది నాడు పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించగా..అప్పటి నుంచి బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 13,40,697 బంగారు కుటుంబాలను 1,41,977 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా 1.69 కోట్ల కుటుంబాలు ఉన్నాయి.. సాయం కోరే పేద కుటుంబాలు 21 లక్షలు ఉన్నాయి. మార్గదర్శుల ఎంపికలో ఎలాంటి బలవంతం లేకుండా.. పూర్తి స్వచ్ఛంధంగానే ఈ కార్యక్రమాన్ని చేపడతున్నాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు."నేను కూడా మార్గదర్శినే. కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. సీఎంగా, పార్టీ అధ్యక్షుడిగా ఎంత బిజీగా ఉన్నా... దత్తత తీసుకున్న కుటుంబాలకు సమయం కేటాయిస్తా. మార్గదర్శులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోవాలి.. అభివృద్ధి చెందాలి.. సద్వినియోగం చేసుకోవాలి. అలాగే సమాజం ఇచ్చిన సహకారంతో ఎదిగిన వారు సమాజానికి తిరిగివ్వాలని మార్గదర్శులు కూడా ఆలోచించాలి. మార్గదర్శులు డబ్బులిచ్చి సాయం చేయడంతో సరిపెట్టకుండా... బంగారు కుటుంబాలకు భరోసాగా ఉండాలి'' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను అనుకున్నదే చేస్తారు. దానిపై ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కు తగ్గరు. తనకు అనుకూలమైన మీడియా వ్యతిరేకించినా తాను మాత్రం అనుకున్న దారిలోనే ముందుకు వెళతారు. అందులో పీ4 పథకం పై ఆయన ముందుకు వెళ్లడానికే నిర్ణయించుకున్నారు. ఎవరేమనుకున్నా.. ఎవరేం చెప్పినా తన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయన్న నమ్మకంతో చంద్రబాబు ఉన్నారు. పేదరిక నిర్మూలన అంటే మొత్తం పేదరికం రూపుమాపడం కాదని, కనీసం వాళ్లు తమ కుటుంబాన్ని పోషించుకునే స్థోమతను కల్పించడమే తన ఉద్దేశ్యమని చెప్పకనే చెప్పుకొచ్చారు. ఇందుకోసం వెనక్కు తగ్గబోమని, పేదవాళ్ల కోసం మనసున్న వాళ్లు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పదే పదే పిలుపు నిస్తున్నారు. గత ఉగాదికి పీ4 పథకాన్ని చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి పేదల కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులను కూడా ఎంపిక చేసుకుంటూ వెళుతున్నారు. తాను నియోజకవర్గాలను పర్యటించినప్పుడు కనీసం రెండు, మూడు బంగారు కుటుంబాలను గుర్తించే పనిగా పెట్టుకున్నారు చంద్రబాబు నాయుడు. ఇప్పటికే ఈ పథకం కింద దాదాపు పదమూడు లక్షల మంది బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. అలాగే మార్గదర్శకులుగా ఉండేందుకు దాదాపు 1.40 లక్షల మంది ముందుకు రావడం కూడా పథకం విజయవంతమవుతుందన్న నమ్మకంతో ఉన్నారు. వీరిలో ప్రవాసాంధ్రులతో పాటు పారిశ్రామికవేత్తలు కూడా ఉన్నారు. సంపద సృష్టించడమంటే పేదల ఇళ్లల్లో వెలుగు నింపడమేనని చంద్రబాబు బలంగా విశ్వసిస్తున్నారు. ఈ పథకం వల్ల కొన్ని కుటుంబాలయినా కూడు, గుడ్డ, నివాసానికి ఇబ్బంది లేకుండా ఉండగలిగితే సగం విజయం సాధించినట్లేనని నమ్ముతున్నారు. ఎంతమందికి అవకాశాలు కల్పించామన్నది కాకుండా వారు జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశాలు కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. దీనివల్ల పేదల కుటుంబాల్లో తొలుత మానసికంగా ధైర్యంవస్తుందని, తర్వాత వారు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవడమే కాకుండా పది మందికి ఉ పయోగపడేలా తయారవుతారన్నది చంద్రబాబు ఆలోచన. ఈ మేరకు తన సొంత మీడియాలో విమర్శలు వచ్చినా లెక్క చేయడం లేదు. పీ4 పథకం ఖచ్చితంగా సక్సెస్ అవుతుందని ఆయన బలంగా విశ్వసిస్తున్నారు. మరి ఈ పథకం సక్సెస్ అయితే మాత్రం చంద్రబాబు నాలుగో పర్యాయంలో నూతన పథకంతో జనంలోకి వెళ్లినట్లే అనుకోవాల్సి ఉంటుంది.ఆరోగ్యం కోసం బెస్ట్ విధానం తీసుకురాబోతున్నాం. బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రజారోగ్య పరిరక్షణ చేపడతాం.

# మినపప్పుతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు.. బరువుకు చెక్, ఇంకా



మనం తీసుకునే ఆహారాలలో పప్పులకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు వంటి పప్పులు పోషకాలు సమృద్ధిగా ఉండి మనకు ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తాయి. ప్రస్తుత మనం మినపప్పు యొక్క ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుందాం. సహజంగా మనం అందరి ఇళ్లలోనూ మినపప్పును ఎక్కువగా ఉపయోగిస్తాం. ప్రతిరోజు ఉదయం బ్రేక్ఫాస్ట్ చేసుకోవడానికి మినపప్పును వాడుతూ ఉంటాం. మినప్పప్పులో ఫుల్ పోషకాలు ఇడ్లీ, దోశ, వడ ఇలా మినప్పప్పు తో చేసే అనేక ఆహారాలు మన శరీరానికి కావలసిన పోషకాలను ఇస్తున్నాయి. మినప్పప్పు లో ప్రోటీన్, ఫైబర్, ఐరన్, మాంగనీస్, పొటాషియం, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉన్నాయి. మినప్పప్పు లో ప్రోటీన్ మరియు ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది బరువు తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న వారికి మంచి ఎంపికగా చెప్పవచ్చు. మినప్పప్పుతో ఈ ఆరోగ్య ప్రయోజనాలు మినప్పప్పులో అధిక ప్రోటీన్ కంటెంట్ కండరాల నిర్మాణంలో దోహదం చేస్తుంది. ఇది మెటబాలిజాన్ని పెంచుతుంది. బరువు నిర్వహణలో సహాయపడుతుంది. మినప్పప్పులోని ఫైబర్ జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. మీరు ఎక్కువసేపు తృప్తిగా ఉండేలా చేస్తుంది. చిరుతిండ్లు తినాలనే కోరికను తగ్గిస్తుంది. ఈ పప్పు తక్కువ క్యాలరీలతో కూడి ఉంటుంది. మినప్పప్పును ఆహారంలో భాగంగా చేర్చడం అదనపు క్యాలరీలు జోడించకుండా అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఖనీలివతీవట ఃఎ రోజంతా చురుకుగా ఉండేలా చేసే మినప్పప్పు మినప్పప్పు లో ఉండే పోషకాలు బరువు తగ్గించే ప్రయత్నాలకు తోడ్పడుతూ మొత్తం ఆరోగ్యాన్ని మద్దతును ఇస్తాయి. ఐరన్ శక్తి స్థాయిలను పెంచుతాయి. మినప్పప్పుతో చేసిన ఆహారాలు మీరు రోజంతా చురుకుగా ఉండటానికి సహాయపడుతుంది. మినప్పప్పులో ఉండే పొటాషియం శరీరంలోని ద్రవ సమతుల్యతను నిర్వహించడంలో సహాయపడుతుంది. హైబీపీ, డయాబెటిస్ కు మినప్పప్పుతో చెక్ మెగ్నీషియం కండరాల పనితీరుకు మద్దతు ఇస్తుంది. మినప్పప్పు ఎముకలకు బలాన్ని ఇస్తుంది. రక్తపోటును మెరుగుపరచటానికి, డయాబెటిస్ ను తగ్గించటానికి సహా యపడుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రక్త హీనతను నివారించటానికి కూడా మినప్పప్పు ఉపయోగపడుతుంది. మినప్పప్పు అనేక ప్రయోజనాలను అందించినప్పటికీ, ప్రభావవంతమైన బరువు తగ్గడానికి సమతుల్య ఆహారం మరియు నిత్యం వ్యాయామం చేయడం అనేది అవసరం. మినప్పప్పును తీసుకునేవారు మితంగా తీసుకోవటం మంచిది.

# దానిమ్మ తొక్కే కదా అని పారేస్తున్నారా? ఈ బెనిఫిట్స్ తెలిస్తే వదిలిపెట్టరు!

దానిమ్మ గింజలు మాత్రమే కాదు దానిమ్మ తొక్కలు కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తాయి. చాలామంది దానిమ్మ గింజలు ఒలిచిన తర్వాత తొక్కలను పడేస్తూ ఉంటారు. అయితే దానిమ్మ గింజలలో, మాత్రమే కాదు తొక్కలలో ఉండే పోషకాలు మనకు బాగా ఉపయోగపడతాయి. దానిమ్మ తొక్కలలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఫైబర్ మరియు ఖనిజాలు ఉంటాయి. దానిమ్మ తొక్కలతో చాలా బెనిఫిట్స్ దానిమ్మ తొక్కలను మన ఆహారంలో భాగంగా చేనుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. దానిమ్మ తొక్కలను ఎండబెట్టి పొడిలా చేసుకుని టీ చేసుకుని తాగవచ్చు. అంతేకాదు దానిమ్మ తొక్కల నుండి తీసిన సప్లిమెంట్లను కూడా మనం తీసుకోవచ్చు. దానిమ్మ తొక్కల పొడిని నీళ్లలో కలిపి పేస్టులా చేసి చర్మానికి, జుట్టుకి రాసుకుంటే కూడా మంచి ఫలితాలు ఉంటాయి. అసలు దానిమ్మ తొక్కలతో ఎటువంటి ఆరోగ్యప్రయోజనాలు కలుగుతాయి అనేది ప్రస్తుతం చూద్దాం.ని దానిమ్మ తొక్కలతో ఈ ఆరోగ్య ప్రయోజనాలు దానిమ్మ



తొక్కలతో జీర్ణక్రియ మెరుగుపడుతుంది. దానిమ్మ తొక్కల లోని ఫైబర్ మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. పేగు కదలికలను క్రమబద్ధీకరిస్తుంది. దానిమ్మ తొక్కలు గుండె ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి. ఇవి రక్తపోటును తగ్గించడానికి, శరీరంలోని కొలెస్ట్రాల్ ను నియంత్రించడానికి బాగా పనిచేస్తాయి. దానిమ్మ తొక్కలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు శరీరంలో మంటను తగ్గించడానికి కూడా దోహదం చేస్తాయి. దానిమ్మ తొక్కలతో అందం, ఆరోగ్యం దానిమ్మ తొక్కలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు నోట్లో బ్యాక్టీరియా పెరుగుదలను నియంత్రిస్తాయి. దంత సమస్యలను నివారిస్తాయి. దానిమ్మ తొక్కలు జుట్టు ఆరోగ్యానికి ఎంతో బాగా పనిచేస్తాయి. చుండ్రు నివారించడానికి, జుట్టు రాలకుండా ఉండడానికి పేస్టులా చేసుకుని తలకు పెట్టుకుంటే మంచిది. ఇక దానిమ్మ తొక్కలను టీ గా గాని, పొడిగా గాని చేసుకొని ఆహారంలో భాగంగా తీసుకోవడం చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దానిమ్మ తొక్కలు ఇలా తీసుకుంటేనే బెస్ట్ చర్మం యవ్వనంగా కనిపించడానికి, ముడతలు రాకుండా, వృద్ధాప్య ఛాయలు లేకుండా ఉండడానికి దానిమ్మ తొక్కలు ఉపయోగపడతాయి. దానిమ్మ తొక్కలో క్యాన్సర్ ను నివారించే లక్షణాలు ఉన్నాయి. క్యాన్సర్ కణాల పెరుగుదలను ఇవి నిరోధిస్తాయి. ఇన్ని ప్రయోజనాలు ఉన్న దానిమ్మ తొక్కలను ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచిది. కాకుంటే మన ఆహారంలో దేనిని భాగంగా చేసుకున్నప్పటికీ దానిని మితంగానే తీసుకోవాలి. అధికంగా తీసుకోవడం అనర్థాలకు కారణం అవుతుంది.

# వాడిన నూనెను మళ్ళీ వాడుతున్నారా? అయితే హాస్పిటల్ లో బెడ్ కన్ఫర్మ్!

మనం వంట చేయడానికి రకరకాల నూనెలను ఉపయోగిస్తూ ఉంటాం. అయితే కొన్ని రకాల వంటలు చేసిన తర్వాత మళ్లీ ఆ నూనెను రీసైకిల్ చేసి వాడుతూ ఉంటాం. కానీ అలా రీసైకిల్ చేయడం ఏమాత్రం మంచిది కాదని వాడిన నూనెను మళ్లీ మళ్లీ వాడటం వల్ల ఆరోగ్యసమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మన సమాజంలో దీనిపైన పెద్దగా అవగాహన లేకపోవడం వల్ల ఇప్పటికి చాలామంది ఇళ్లల్లో వాడిన నూనెను మళ్లీ మళ్లీ వాడుతున్నారు. వాడిన నూనె మళ్ళీ వాడితే వచ్చే రోగాలివే ఒకసారి ఉపయోగించిన నూనెను మళ్లీ మళ్లీ వేడి చేయడం చాలా ప్రమాదకరమని, అది అనేక అనారోగ్యాలకు దారితీస్తుంది అని చెబుతున్నారు వైద్యులు. నూనెను మళ్లీ మళ్లీ వేడి చేయడం వల్ల అందులో హానికరమైన రసాయనాలు ఉత్పన్నమవుతాయని, ఇవి గుండె జబ్బులు, క్యాన్సర్, డయాబెటిస్ వంటి అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతాయని చెబుతున్నారు. నూనె పదేపదే వేడి చేస్తే ట్రాన్స్ ఫ్యాట్స్ పెరిగే ప్రమాదం నూనెని ఎక్కువగా వేడి చేసినప్పుడు అందులో ట్రాన్స్ ఫ్యాట్స్ పెరుగుతాయి. ఇవి ఆరోగ్యానికి హానికరంగా మారుతాయి. అంతేకాదు నూనె వేడి చేయడం వల్ల దాని నాణ్యత క్షీణించి రుచి కూడా మారిపోతుంది. పదేపదే వేడి చేసిన నూనెను వాడడం వల్ల అందులో విషపూరిత పదార్థాలు విడుదలై ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. నూనె మళ్ళీ మళ్ళీ వాడితే విషపూరిత రసాయనాల ఉత్పత్తి గారెలు, పూరీలు, పకోడీలు ఇతర




తినుబండారాలు తయారు చేసినప్పుడు మిగిలిన నూనెను పార పోయకుండా మళ్లీ వినియోగించడం వల్ల క్యాన్సర్ వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, అందులో ఉత్పన్నమయ్యే హానికరమైన రసాయనాలు శరీరంలో ఫ్రీ రాడికల్స్ పెరిగి కణాలను దెబ్బతీసేలా చేస్తాయని చెబుతున్నారు. ఇక తరచుగా వినియోగించిన నూనెను పదేపదే వినియోగించడం వల్ల హైపర్ టెన్షన్ వచ్చే సమస్య కూడా ఉందని హెచ్చరిస్తున్నారు. వంట నూనెల వినియోగంలో జాగ్రత్త అవసరం ముఖ్యంగా మాంసాహారాన్ని వేయించిన నూనెలను పదేపదే వాడితే అది మిమ్మల్ని కచ్చితంగా ఆసుపత్రి పాలు చేస్తుంది. హాస్పటల్లో బెడ్ రిజర్వ్ చేసుకునే పరిస్థితికి తీసుకువస్తుంది. కనుక ఆరోగ్యంగా ఉండాలని భావించేవారు వంట నూనెల వినియోగంలో జాగ్రత్త వహించాలి, నూనెను వాడుతున్నప్పుడు ఎంతసేపు వేడి చేశాం, ఎంత మొత్తంలో వాడుతున్నాం అనే విషయాలను తెలుసుకొని తదనుగుణంగా ప్రవర్తించాలి. లేదంటే అనవసరమైన అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది.

# చింతపండే కదా అని తేలిగ్గా తీసి పారేశారో..!!



చింతపండు లేదా చింతకాయలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అనేక ఆరోగ్య సమస్యలకు ఇది హోమ్ మెడిసిన్ గా ఉపయోగపడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: చింతపండులో శక్తివంతమైన యాంటీమైక్రోబయల్ సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి హానికరమైన బాక్టీరియా, ఫంగస్తో పోరాడతాయి. తద్వారా ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. సహజ రోగనిరోధక శక్తిని కాలక్రమేణా పెంచుతాయి. కణాలను నష్టం నుండి కాపాడుతుంది: ఫినాలిక్స్ వంటి యాంటీఆక్సిడెంట్ అధికంగా ఉండే సమ్మేళనాలు చింతపండులో ఉన్నాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడం, క్యాన్సర్, గుండె సమస్యలు వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: చింతలోని సహజమైన పులుపు లక్షణాలు మలబద్ధకాన్ని నివారిస్తాయి. టార్టారిక్ ఆమ్లం ఉండటం వల్ల ప్రేగు కదలికలను మెరుగుపరుస్తుంది. ఇది ప్రతిరోజూ తేలికగా, సౌకర్యవంతంగా ఉండటానికి సహాయపడుతుంది. సాధారణ కడుపు సమస్యలను తగ్గిస్తుంది: చింతపండు కడుపు నొప్పి, అసౌకర్యాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా అజీర్ణం, ఉబ్బరం లేదా తేలికపాటి జీర్ణశయాంతర సమస్యలు తలెత్తితే చింతపండు తీసుకోవడం ద్వారా నివారించవచ్చుఊబకాయం తగ్గించే ఆహారాలు ఇవే!" గాయాలను నయం చేయడంలో సహాయపడుతుంది: చింతచిగురు, చింత చెట్టు బెరడు. గాయాలను నయం చేయడంలో సహాయపడతాయి. గాయాలను శుభ్రపరచడానికి, ఇన్ఫెక్షన్లను తొలగించడానికి, చర్మంపై పైపూతగా పూసినప్పుడు వేగంగా కోలుకోవడానికి మద్దతు ఇస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: చింతగింజ సారం రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించగలదని అధ్యయనాల్లో తేలింది. ఇది సహజ మార్గాల్లో డయాబెటిస్ నిర్వహణకు ఉపయోగపడుతుంది. చెడు కొలెస్ట్రాల్, రక్తపోటును తగ్గిస్తుంది: చింతపండు కొలెస్ట్రాల్ స్థాయి, రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది ఆరోగ్యకరమైన హృదయ సంబంధ వ్యవస్థకు తోడ్పడుతుంది. గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. చింతపండును సాంప్రదాయకంగా జ్వరం, మలేరియా లక్షణాలను తగ్గించడానికి ఉపయోగిస్తారు. దీని పండు గుజ్జు, ఆకులు శరీర ఉష్ణోగ్రతను తగ్గించి ఉపశమనం కలిగిస్తాయి. పాము విషం ప్రభావాలను తగ్గిస్తుంది: చింతపండు గింజల సారం కొన్ని విష ఎంజైమ్ల ప్రభావాన్ని సైతం తగ్గించగలదని పరిశోధనలో తేలింది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో పాము కాటు నుండి విషపూరిత ప్రభావాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాలేయం, శ్వాసకోశ ఆరోగ్యాన్ని కాపాడుతుంది: చింతపండులో హెపాటోప్రొటెక్టివ్, యాంటీ-ఆస్తమాటిక్ లక్షణాలు ఉన్నాయి. ఇది కాలేయాన్ని కాపాడుతుంది. ఆస్తమా, శ్వాసకోశ మంట లక్షణాలను తగ్గిస్తుంది. చింతపండు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి మరియు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సహాయపడుతుంది. దీనిని ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని పొందవచ్చు.

# మీ కిడ్నీల ఆరోగ్యం మీ చేతుల్లోనే - ఈ పొరపాట్లు చేయద్దు..!!



కిడ్నీలు ముఖ్యమైన అవయవం. ఇవి రక్తాన్ని శుభ్రపరిచి, వ్యర్థ పదార్థాలను తొలగిస్తాయి. ఇతర అవయవాల మీద ఉన్న శ్రద్ధ కిడ్నీల పైన కొందరు చూపటం లేదు. ఫలితంగా కిడ్నీ సమస్యలు, రాళ్లు సహా ఇతర సమస్యల బారిన పడుతున్నారు. దీంతో, కిడ్నీ సమస్యలు రాకుండా ఉండేలా కొన్ని సూచనలు వైద్యులు చేస్తున్నారు. మూత్ర పిండాల వ్యాధి నరాలు, ఇతర అవయవాలను కూడా ప్రభావితం చేస్తుంది. ఇది చివరికి గుండె జబ్బులు, స్ట్రోక్, రక్తహీనతకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగినంత నీరు తాగటం చాలా ముఖ్యం. హైడ్రేట్ గా ఉండటం మూత్రాన్ని పలుచగా ఉండటంతో పాటుగా రాళ్ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని వివరించారు. కనీసం ప్రతిరోజూ 8 నుంచి 10 గ్లాసుల నీరు తాగాలని సూచిస్తున్నారు. తాజా పండ్లు, తాజా కూరగాయలు, తృణధాన్యాలు, తక్కువ కొవ్వు లేదా కొవ్వు రహిత పాల ఉత్పత్తులు కిడ్నీ ఆరోగ్యా న్ని పెంచుతాయి. అధిక సోడియం, ప్రాసెస్ చేసిన ఆహారాలు, కొవ్వులు అధికంగా ఉన్న పదార్థా లకు దూరంగా ఉండాలిని హెచ్చరిస్తున్నారు. రక్తపోటు నియంత్రణ లో లేకపోతే కిడ్నీలోని రక్త నాళాల మీద ఒత్తిడి పెరుగుతుంది. మూత్ర పిండాల ఆరోగ్యానికి వ్యాయామం ఉపకరిస్తుంది. రక్తంలో మోతాదు మించిన షుగర్ లెవల్స్ ఉండటం వల్ల దీర్ఘకాలంలో మూత్రపిండాలను దెబ్ బతీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం వల్ల మూత్ రపిండాల వ్యాధి ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. నాన్ స్టెరాయిడల్ యాంటీ ఇన్?ఫ్లమేటరీ డ్రగ్స్ వంటి కొన్ని నొప్పి నివారణ మందులు అధిక మోతాదులో లేదా దీర్ఘకాలంగా ఉపయోగించినప్పుడు కిడ్నీలకు హాని కలిగించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ధూమపానం రక్తనాళాలను దెబ్బతీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ రోజువారీ అలవాట్లను క్రమం తప్ప కుండా పాటించడం వల్ల మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చుని నిపుణులు చెబుతున్నారు.





# సినిమా



## మాస్ జాతర వాయిదా.. ఇది అసలు మ్యాటర్!



మాస్ మహారాజా రవితేజ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మాస్ జాతర సినిమాకు మరో బ్రేక్ పడింది. ఎప్పటిలాగే ఎనర్జీతో తెరపై మాస్ ఫీవర్ క్రియేట్ చేయడానికి రవితేజ సిద్ధంగా ఉన్నప్పటికీ, కొన్ని అనుకోని పరిస్థితుల వల్ల సినిమా రిలీజ్ వెనక్కి వెళ్లింది. దీంతో అభిమానుల్లో కాస్త నిరాశ కనిపిస్తున్నా, నిర్మాతలు మాత్రం అసలైన ఎంటర్టైన్మెంట్ ను మాస్ స్టైల్లో అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై పాజిటివ్ వైబ్ క్రియేట్ చేశాయి. ప్రత్యేకంగా 'ఓలే ఓలే' సాంగ్ రవితేజ, శ్రీలీల కెమిస్ట్రీతో థియేటర్లలో పండగ చేసుకుంటారని అభిమానులు భావించారు. కానీ పరిశ్రమలో జరిగిన సమ్మెలు, కీలకమైన పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఊహించని జాప్యం కారణంగా సినిమా అనుకున్న తేదీకి సిద్ధం కాలేకపోయింది. నిర్మాతలు అధికారిక ప్రకటనలో స్పష్టం చేసినట్లుగా, కంగారుగా రిలీజ్ చేయడం కన్నా కొంత సమయం తీసుకుని క్వాలిటీతో కూడిన ఫిల్మ్‌గా మలచాలని నిర్ణయం తీసుకున్నారు. మాస్ మహారాజా కెరీర్‌లో 75వ చిత్రంగా వస్తున్న ఈ మూవీకి ప్రత్యేకత ఉండాలని టీమ్ శ్రమిస్తోంది. థియేటర్లో చూసిన ప్రతి ప్రేక్షకుడు అసలైన మాస్ ఎంటర్‌టైన్‌మెంట్ అనుభూతి పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం కొత్త విడుదల తేదీని ఖరారు చేయలేదు. కానీ త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. ఫ్యాన్స్ కోసం ప్రత్యేక కంటెంట్ కూడా రెడీ చేస్తూ, త్వరలోనే ఆశ్చర్యపరిచే సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నట్లు హామీ ఇచ్చారు. భాను భోగవరపు దర్శకత్వంలో రూపొందుతున్న మాస్ జాతరను సితార ఎంటర్టైన్మెంట్స్, శ్రీకర స్టూడియోస్ నిర్మిస్తున్నారు. రవితేజ సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ఆడియో, విజువల్స్‌తో మంచి బజ్ సంపాదించింది. మొత్తానికి, కాస్త ఆలస్యం అయినా 'మాస్ జాతర' థియేటర్లలో నిజమైన మాస్ పండుగను తీసుకురానుందని నిర్మాతలు స్పష్టంగా చెప్పారు. రవితేజ వింటేజ్ ఎనర్జీ, శ్రీలీల మ్యాజిక్, భీమ్స్ బీట్స్ కలిస్తే బాక్సాఫీస్ వద్ద పెద్ద జాతర జరుగుతుందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు.

## బిగ్ బాస్ అగ్నిపరీక్ష.. నవదీప్ ఫైర్ అవ్వడం వెనక రీజన్ ఏంటి..?

బిగ్ బాస్ అగ్నిపరీక్ష షో మొదలైన 3 రోజుల్లోనే కావాల్సిన వాడి వేడి స్టార్ట్ అయ్యింది. బిగ్ బాస్ షో సక్సెస్ ఫెయిల్యూర్ అన్నది పక్కన పెడితే సోషల్ మీడియాలో ఈ షో గురించి మాత్రం కచ్చితంగా ఒక డిస్కషన్ అయితే జరుగుతుంది. బిగ్ బాస్ ఈసారి సీజన్ కు ముందే బిగ్ బాస్ అగ్నిపరీక్ష అంటూ ఒకటి మొదలు పెట్టారు. ఈసారి కామన్ మ్యాన్ కి బిగ్ బాస్ షో ఛాన్స్ అంటూ అప్లికేషన్స్ ఇన్వైట్ చేసి. వాళ్లలో నుంచి 45 మందిని ఫైనల్ చేసి.. ఆ 45 నుంచి 15 మెంబర్స్ ని ఫైనల్ చేశారు. ఈ క్రమంలో కొన్ని ఎంపికలు జడ్జిల నిర్ణయాన్ని తప్పుపడుతూ సోషల్ మీడియాలో ట్రోల్స్ కూడా మొదలయ్యాయి. అగ్నిపరీక్షలో కంటెస్టెంట్స్ ఎంపిక.. బిగ్ బాస్ అగ్నిపరీక్షలో కంటెస్టెంట్స్ ఎంపిక కోసం స్పెషల్ జ్యూరీ మెంబర్స్ ముగ్గురిని ఫిక్స్ చేశారు. అందులో సీజన్ 1 నుంచి టాప్ 3గా నిలిచిన నవదీప్, సీజన్ 4 విన్న అయిన అభిజిత్, బిగ్ బాస్ ఓటీటీ నాన్ స్టాప్ సీజన్ విన్నర్ అయిన బిందు మాధవిని తీసుకున్నారు. బిగ్ బాస్ అగ్నిపరీక్ష షోకి హోస్ట్ గా శ్రీముఖి చేస్తుంది. శ్రీముఖి కూడా బిగ్ బాస్ సీజన్ 3 లో రన్నరప్ గా నిలిచింది. ఐతే రీసెంట్ ఎపిసోడ్ లో డేర్ ఆర్ డై అనే రౌండ్ లో లెవెల్ 2 లో టాప్ 15 కి వెళ్లేందుకు షకీబ్, కల్కి పోటీ పడ్డారు. ఒకరికి తెలియకుండా మరొకరికి మీకు తెలిసిన వాళ్లకి ఫోన్ చేసి కొంత అమౌంట్ మీ అకౌంట్ లోకి కొట్టించుకోండని చెప్పారు. ఐతే కల్కి అలా 90 తౌసండ్ అకౌంట్ లోకి వచ్చేలా చేసుకుంది. నెక్స్ట్ షకీబ్ 60 తౌసండ్ వచ్చేలా చేసుకున్నాడు. ఐతే హోస్ట్ శ్రీముఖి కల్కికి మాక్సిమం అమౌంట్ చెప్పింది.. కానీ షకీబ్ కి అంత డీటైల్డ్ గా చెప్పలేదు. నవదీప్ శ్రీముఖి తప్పుని కవర్ చేయాలని.. ఈ విషయంపై నవదీప్



మాట్లాడుతూ షకీబ్ కన్ ఫ్యూజ్ అయ్యావా.. అన్ ఫెయిర్ అనిపించిందా అంటే.. కన్ ఫ్యూజ్ అని చెప్పి వెళ్లాడు. కానీ అతనికి సపోర్ట్ గా మరో కంటెస్టెంట్ శ్రీజ మాత్రం అన్ ఫెయిర్ అన్నది. ఐతే ఆమెకు క్లారిటీ ఇవ్వాల్సిన నవదీప్ ఊపుకుంటూ వస్తారంటూ కాస్త అతి చేశాడు. ఐతే నవదీప్ శ్రీముఖి తప్పుని కవర్ చేయాలని అలా అన్నాడా లేదో తెలియదు కానీ చాలా కూల్ గా ఉంటూ ఎప్పుడు ఎంటర్టైనింగ్ గా ఉండే నవదీప్ తన కూల్ నెస్ మిస్ అవ్వడం షాకింగ్ అనిపించింది. ఐతే నవదీప్ అక్కడ శ్రీజ ని కావాలని కాదు గత 3 డేస్ నుంచి ఎంతోమంది కంటెస్టెంట్ ని చూసి ఆ విసుగుతో అలా అని ఉండొచ్చని అంటున్నారు. ఏది ఏమైనా వాళ్లు కామన్ మ్యాన్ అయినా కూడా అలా డిస్ రెస్పెక్టబుల్ గా మాట్లాడటం తప్పని సోషల్ మీడియాలో చెప్పుకుంటున్నారు.

## క్యూట్ బ్యూటీ డిఫరెంట్ ఔట్ ఫిట్ షో



సుధీర్ బాబు హీరోగా నటించిన ఎస్ఎంఎస్(శివ మనసులో శృతి) సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ రెజీనా కాసాండ్రా. మొదటి సినిమా కమర్షియల్ బ్రేక్ ఇవ్వనప్పటికీ తెలుగులో మరిన్ని ఆఫర్లను సొంతం చేసుకుంది. తన అందంతో పాటు, నటన ప్రతిభ కారణంగా తెలుగులో అదే ఏడాదిలో రొటీన్ లవ్ స్టోరీ ఆ తర్వాత కొత్త జంట, రారా కృష్ణయ్య, పవర్, పిల్లా నువ్వు లేని జీవితం, సుబ్రమణ్యం ఫర్ సేల్, సౌఖ్యం, శౌర్యం ఇలా చాలా సినిమాల్లో నటించింది. మీడియం రేంజ్ సినిమాలకు ఒకానొక సమయంలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా చేసింది. అయితే ఇండస్ట్రీలో పది కాలాల పాటు నిలిచి పోవాలి అంటే స్టార్ హీరోల సినిమాల్లో నటించాల్సి ఉంటుంది. రెజీనాకు అలాంటి ఆఫర్లు దక్కక పోవడంతో ఎప్పుడూ ఆఫర్ల కోసం వెయిట్ చేయాల్సి వచ్చింది, దాంతో రెజీనా స్టార్ హీరోయిన్స్ జాబితాలో చోటు దక్కించుకోలేక పోయింది. మెగా హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ హీరోయిన్‌గా రెజీనా చేసిన సినిమాలు తక్కువేం కాదని చెప్పాలి. ఒకానొక సమయంలో మెగా హీరోల్లో టైర్ 2 హీరోలకు ఈమె మోస్ట్ వాంటెడ్‌గా నిలిచింది. రకరకాలుగా ఆసమయంలో పుకార్లు సైతం వచ్చిన విషయం తెల్సిందే. ఇప్పుడు రెజీనా పూర్తిగా తమిళ్, హిందీ సినిమాలకు పరిమితం అయింది. తెలుగులో ఈమె చివరగా ఉత్సవం అనే సినిమాలో కనిపించింది. ఆ సినిమా పెద్దాగా ఆడక పోవడంతో కమర్షియల్ బ్రేక్ కోసం ఎదురు చూస్తుంది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. అవి మీడియం రేంజ్ చిత్రాలే అయినప్పటికీ ఖచ్చితంగా తమిళ్, హిందీ భాషల్లో ఆ సినిమాల వల్ల రెజీనా ముందు ముందు మినిమం సినిమాలను దక్కించుకుంటుంది అనే విశ్వాసంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో రెజీనా జోరు రెజీనా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. దాదాపుగా 25 లక్షల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న రెజీనా రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా తన ఫాలోవర్స్‌కి వినోదాన్ని పంచుతూ ఉంటుంది. తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేయడం ద్వారా రెజీనా వార్తల్లో నిలిచింది. ఇప్పుడు ఈ డిఫరెంట్ ఔట్ ఫిట్‌ను ట్రై చేసి ఫోటోలకు ఫోజ్‌లు ఇవ్వడం ద్వారా అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ రెజీనా సొంతం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆమె రెగ్యులర్‌గా వర్కౌట్స్ చేస్తూ ఇలా అందం ఏమాత్రం తగ్గకుండా కాపాడుకుంటూ ఉంది. అందుకే ఎలాంటి ఔట్ ఫిట్ లో అయినా రెజీనా చూపు తిప్పనివ్వడం లేదు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## ది గర్ల్ ఫ్రెండ్.. అనదర్ లవబుల్ సాంగ్..!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న లీడ్ రోల్ లో వస్తున్న సినిమా ది గర్ల్ ఫ్రెండ్. దీక్షిత్ శెట్టి కూడా ఈ సినిమాలో నటిస్తున్నాడు. చిలసౌ ఫేం రాహుల్ రవింద్రన్ డైరెక్షన్ లో ఈ సినిమా తెరకెక్కుతుంది. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినేని ఈ సినిమా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్ లో సూపర్ ఫాం లో ఉన్న రష్మిక నుంచి వస్తున్న ఈ సినిమాపై కూడా బజ్ బాగుంది. హేషం అబ్దుల్ వాహబ్ మ్యూజిక్.. ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్ ఆడియన్స్ కి ఎంగేజ్ అవగా రీసెంట్ గా వచ్చిన నదివే సాంగ్ కూడా ఇంప్రెస్ చేసింది. ఇక లెటెస్ట్ గా సినిమా నుంచి ఏం జరుగుతుంది సాంగ్ రిలీజైంది. ఈ సినిమాకు హేషం అబ్దుల్ వాహబ్ మ్యూజిక్ అందిస్తున్నారు. తాను మ్యూజిక్ అందిస్తున్న ప్రతి సినిమాతో మ్యూజిక్ తో ఇంప్రెస్ చేస్తున్నాడు హేషం. ది గర్ల్ ఫ్రెండ్ సినిమాకు కూడా బెస్ట్ మ్యూజిక్ ఇస్తున్నాడు హేషం. ఇక ఏం జరుగుతుంది సాంగ్ విషయానికి వస్తే.. ఈ సాంగ్ లో దీక్షిత్, రష్మిక బాండింగ్ ని చూపిస్తూ వచ్చింది. ఏం జరుగుతుంది సాంగ్ ని రాకెందు మౌళి రాయగా హేషం అబ్దుల్ వాహబ్ ఇంకా చిన్మయి ఆలపించారు. చిన్మయి పాడే




తెలుగు పాటలకు సూపర్ ఫ్యాన్స్ ఉన్నారు. ఆఫ్టర్ గ్యాప్ చిన్మయి పాడిన ఈ సాంగ్ సంథింగ్ స్పెషల్ గా ఉందని చెప్పొచ్చు. రష్మిక, దీక్షిత్ శెట్టి ది గర్ల్ ఫ్రెండ్.. రష్మిక, దీక్షిత్ శెట్టి నటించిన ది గర్ల్ ఫ్రెండ్ నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసుకుని రిలీజ్ కు రెడీ అవుతుంది. ఈ సినిమాను పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. తెలుగుతో పాటు హిందీలో ది గర్ల్ ఫ్రెండ్ సినిమాకు మంచి బిజినెస్ జరుగుతుందని తెలుస్తుంది. మరి ఈ సినిమాతో రష్మిక తన సత్తా చాటుతుందా లేదా అన్నది చూడాలి.ఓ పక్క కమర్షియల్ సినిమాలు చేస్తూనే రష్మిక ఇలా కంటెంట్ ఉన్న సినిమాలతో కూడా తన సత్తా చాటుతుంది. రష్మిక దీక్షిత్ శెట్టి ఈ ఇద్దరి లవ్ స్టోరీ ప్రేక్షకులను ఎంతగా ఆకట్టుకుంటుందో చూడాలి.



## ఇప్పుడు ఏ హీరోకీ కంఫర్ట్ జోన్ లేదు

ఒకప్పుడు ఏదైనా సినిమా హిట్ అయితే ఆ హిట్ చాలా కాలం గుర్తుండిపోయేది కానీ ఇప్పుడలా కాదు, కాలం, పరిస్థితులు అన్నీ మారాయి. ఒకప్పటిలా ఇప్పుడు రోజులు లేవు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు సినిమాలు రావడం ఎక్కువయ్యాయి. సినిమాలు ఎక్కువ అవడంతో సక్సెస్ రేటు తగ్గింది. మునుపటి కంటే ఎక్కువ సినిమాలు హిట్టవుతున్నా సక్సెస్



రేటు మాత్రం తక్కువగానే ఉంటుంది. ప్రయోగాలకు పెద్ద పీట హీరోల నుంచి క్యారెక్టర్ ఆర్టిస్టుల వరకు, డైరెక్టర్ల నుంచి నిర్మాతల వరకు అందరూ కొత్తదనాన్ని కోరుకుంటూ ప్రయోగాలు కూడా ఎక్కువగానే చేస్తున్నారు. అందులో భాగంగానే హీరోలు విలన్లుగా మారుతున్నారు. సపోర్టింగ్ రోల్స్ చేసే వారు కూడా పాత్రా ప్రాధాన్యం ఉన్న సినిమాలకే పెద్ద పీట వేస్తున్నారు. ఏదేమైనా కథల నుంచి, సక్సెస్ ను ఎంజాయ్ చేసే వరకు ఏ విషయంలోనూ ఒకప్పుడు ఉన్నంత కంఫర్ట్ అయితే లేదు. ఆగస్ట్ 27న సుందరాకాండ రిలీజ్ ఇదే విషయాన్ని చెప్తున్నారు టాలీవుడ్ హీరో నారా రోహిత్. తను హీరోగా వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా సుందరకాండ. ఈ మూవీ ఆగస్ట్ 27న వినాయక చవితి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుండగా ప్రమోషన్స్ లో భాగంగా మీడియా ముందుకొచ్చిన నారా రోహిత్ హీరోలు, ఆర్టిస్టుల కంఫర్ట్ జోన్ గురించి మాట్లాడారు. ఇప్పుడు ఏ హీరోకీ కంఫర్ట్ జోన్ లేదు ఇప్పుడు ఏ హీరోకీ కూడా ఒకప్పుడున్నంత కంఫర్ట్ జోన్ లేదని, గతంలో ఒక్క హిట్ వచ్చిందంటే నాలుగు ఐదు సినిమాల వరకు ఎలాంటి టెన్షన్ ఉండేది కాదని, కానీ ఇప్పుడు ఆ ఛాన్స్ లేదని అంటున్నారు నారా వారబ్బాయి. సినిమా చూసేటప్పుడు ఆడియన్స్ ఎంత ఇంట్రెస్ట్ గా ఉంటారో, కథ వినేటప్పుడు తాను కూడా అలానే ఉంటానని, స్క్రిప్ట్ కొత్తగా ఉందనిపిస్తే కచ్చితంగా ఆ సినిమా చేయడానికి ప్రయత్నిస్తానని, ఎవరైనా మంచి విలన్ క్యారెక్టర్ ను రాసి తీసుకొస్తే విలన్ గా నటించడానికి కూడా రెడీ అంటున్నారు నారా రోహిత్. మరి రోహిత్ ను అలాంటి పాత్రతో ఎవరు మెప్పిస్తారో చూడాలి.

# గణపతికి అనేకచోట్ల ప్రత్యేక ఆలయాలు

## కాణిపాకంలో వరసిద్ది వినాయకుడు

## ముంబై సిద్ది వినాయకుడి ఆలయం



చిత్తూరు/ముంబై,ఆగస్ట్26:వినాయకుడు విఘ్నాలను తొలగిస్తాడు కనుక ఆయనకే తొలిపూజ చేయడ ఆచారంగా వస్తోంది. విఘ్నేశ్వరుడు ప్రమథగణాలకు అధిపతి గనుక గణపతి అంటారు. అనేక పేర్లతో అలరారుతున్న గణనాధుడికి ప్రపంచ్యాప్తంగా పూజలు నిర్వహించడం హైందవ సంప్రదాయంలో భాగంగా మారింది. వినాయకుడికి ఎన్నో నామాలు ఉన్నట్లే, ఎన్నో రూపాలు కూడా ఉన్నాయి. వినాయకుడి కథ, వినాయక చవితి పూజావిధానం దాదాపు అందరికీ తెలిసినదే. వివిధ రూపాల్లో కొలువుదీరే వినాయకుడికి ప్రత్యేక ఆలయాలు కూడా ఉన్నాయి.

వరసిద్ధి వినాయక ఆలయం చిత్తూరు జిల్లా కాణిపాకం గ్రామంలో ఉంది. వరసిద్ధి వినాయకుడు ఇక్కడ స్వయంభువుగా వెలిశాడు. ఈ ఆలయంలో వినాయకుని విగ్రహం నేటికీ బావిలోనే కనిపిస్తుంది. ఈ ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు తమకు ఇష్టమైన పదార్థాన్ని స్వామివారికి వదిలిపెడితే కోరికలు తీరుతాయని నమ్మకం. అలాగే, కాణిపాకం వినాయకుడు సత్య ప్రమాణాల వినాయకుడిగా కూడా ప్రసిద్ధుడు. ఇక్కడ వినాయకుని ఎదుట ప్రమాణం చేసిన వారు సత్యమే పలకాలని, అసత్యం పలికిన వారికి అనర్థాలు తప్పవని కూడా భక్తులు నమ్ముతారు. సికింద్రాబాద్‌లో గణేశ్ ఆలయం ప్రసిద్ధి చెందింది. హైదరాబాద్‌లో అలా నాలుగైదు ఆలయాలు ప్రత్యేకంగా ఉన్నాయి. ఇకపోతే మహారాష్ట్రలోని ముంబైలో వరసిద్ధి వినాయకుడు కూడా బాగా ప్రసిద్ధి. ఇక్కడ వ్యాపారవేత్తలు తమారాధ్య దైవంగా కొలుస్తారు. కేరళలోని మధుర మహాగణపతి ఆలయం ఒకప్పుడు శివాలయం. పరమశివుడు మదరనాథేశ్వరునిగా ఇక్కడ వెలశాడు. స్వయంభువుగా వెలసిన శివలింగానికి తుళురాజులు ఆలయం నిర్మించారు. మదరు అనే వృద్ధురాలు ఈ శివలింగాన్ని కనుగొనడంతో ఆమె పేరిట ఇక్కడి శివుడు మదరనాథేశ్వరునిగా ప్రసిద్ధి పొందాడని ప్రతీతి. మైసూరు రాజ్యాన్ని పరిపాలించిన టిప్పు సుల్తాను చాలా ఆలయాలపై దాడులు చేసినట్లుగానే ఈ ఆలయంపైనా దాడి చేయడానికి వచ్చాడని చెబుతారు. మూషిక వాహనుడైన వినాయకుడు నెమలి వాహనంపై కనిపించే అరుదైన ఆలయం ఇది. అందుకే ఇక్కడ వెలసిన వినాయకుడు మయూరేశ్వరుడిగా ప్రసిద్ధి చెందాడు. స్థానికులు 'మోరేశ్వర్' అని కూడా అంటారు. మయూరేశ్వరుడు వెలసినందున ఈ క్షేత్రానికి 'మోర్గాంవ్' అనే పేరు వచ్చింది. ఇది మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఉంది.మహారాష్ట్రలో ప్రాచీన వినాయక క్షేత్రాలు ఎనిమిది ఉన్నాయి. వీటిని అష్ట వినాయక క్షేత్రాలని అంటారు. అష్ట వినాయక క్షేత్రాలకు తీర్థయాత్రగా వెళ్లేవారు మోర్గాంవ్‌లోని మయూరేశ్వరుడి దర్శనంతో యాత్రను ప్రారంభించడం ఆనవాయితీ. ఇకపోతే రాజస్థాన్‌లోని రణ్‌థాంబోర్ కోటలో ఉన్న ఈ ఆలయంలోని వినాయకుడిని 'ప్రథమ గణేశ' అని కూడా అంటారు. దేశంలో ఇదే మొట్టమొదటి వినాయక ఆలయంగా భావిస్తారు. ఈ ఆలయంలో వెలసిన త్రినేత్ర గణేశ విగ్రహం దాదాపు ఆరున్నర వేల ఏళ్ల కిందటిదని అంచనా. రుక్మిణీ కృష్ణుల వివాహం జరిగినప్పుడు వారు తొలి ఆహ్వాన పత్రికను ఇక్కడి ప్రథమ గణేశునికే పంపారని స్థలపురాణ కథనం. అప్పట్లో రణ్‌థాంబోర్ కోటపై అల్లాఉద్దీన్ ఖిల్జీ దాడి చేశాడు. మధ్యప్రదేశ్‌లోని పురాతన నగరమైన ఉజ్జయినిలో వెలసిన గణపతి ఆలయం ఇది. శైవక్షేత్రంగా, శక్తిపీఠంగా పేరుపొందిన ఉజ్జయినిలో వెలసిన ఈ గణపతి భక్తుల చింతలను తీర్చుతాడని, అందుకే ఇక్కడి గణపతిని చింతాహరణ గణపతి అని, చింతామణి గణపతి అని కూడా అంటారు. ఈ ఆలయంలోని గణపతి స్వయంభువుగా వెలిశాడు. వృద్ధి, సిద్ధి సమేతంగా భక్తులకు దర్శనమిస్తాడు. ఉజ్జయినిలోని మహాకాలేశ్వ రుడిని, మహాకాళిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు మహాకాళేశ్వర ఆలయానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతామన్ గణపతి ఆలయాన్ని కూడా తప్పనిసరిగా దర్శించుకుంటారు. పాండిచ్చేరిలో ఉన్న గణేశాలయం కూడా బాగా ప్రసిద్ధి చెందిందినదే. ఇక్కడ ని÷-య పూజలు జరుపుతుంటారు.

# ప్రకృతి పరిరక్షణ మన సంస్కృతి

**( ఆధ్యాత్మిక చింతన )**

తిరుమల,ఆగస్ట్26: బారతీయ ఆధ్యాత్మిక విధానం మొత్తం ప్రకృతి చుట్టూ అల్లుకుని ఉన్నవే. ప్రకృతి ఆరాధన అన్నది కేవలం భారతీయ సంస్కృతిలోనే చూస్తాం. మన పండగలు పబ్బాలు కూడా వీటిచుట్టే పరిభ్రమిస్తాయి. పంచభూతాలైన భూమి,నీరు,గాలి, అగ్ని,ఆకాశం చుట్టూ తిరుగుతూ వాటిని పూజించే దిశగా సాగుతాయి. మన జీవన విధానానికి అవసరమైన ప్రతి ఒక్కటీ ప్రకృతి ఒడి నుంచి లభించేదే. అందుకే ప్రకృతిని దైవంలా భావించి పూజిండం చేస్తాం. వాటిని కాపాడుకునే క్రమంలో పూజిస్తాం. మన ప్రతి పండగా వీటికి మూలంగా ఉంటోంది. వినాయక చవితితేనే తీసుకుంటే ప్రకృతిని పూజించేదిగా చూడాలి. పుట్టినప్పటి నుంచి మరణించేవరకూ షోడశ సంస్కరణల ద్వారా మనకు రుజువర్తనను అలవడేలా చేసింది. మన భారతదేశానికి ఉన్న గొప్ప ఆధ్యాత్మిక సంపదే మనలను వసుదైక కుటుంబ దిశగా నడిపించింది. మన ఐతిహ్యంలో మాత్రమే ఈ విధానం కనిపిస్తుంది. ఇలా నిత్యజీవితంలో మనం ఆచరించే మంచి అంతా ఆధ్యాత్మికత కిందకే వస్తుంది. చిన్నప్పటి నుంచే పిల్లలకు రామాయణ, మహాభారత, భాగవతాల్లోని ఘట్టాలను వినిపించడం ద్వారా.. పెద్దల నుంచి నేర్చుకున్న సంస్కారాన్ని మన పిల్లలకు నేర్పడం ద్వారా మనకున్న గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని

కొనసాగిస్తున్నాం. భవిష్యత్ తరాలు కూడా మన ఆధ్యాత్మిక సంపద విలువ తెలుసుకుని, ఆచరణలో పెట్టి ఆ వారసత్వాన్ని కొనసాగించాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు సాగిస్తున్నాం. మనిషి తాను బతుకుతూ ఇతరులను బతికేలా చేస్తూ ముందుకు సాగాలన్న ఓ మంచి ఆచారాన్ని మన పెద్దలు మనకు నేర్పారు. భక్తి, పూజలు,పునస్కరాలు అన్నీ ఇందులో ఇమిడి ఉన్నవే. ఆధ్యాత్మికత అంటే అది కేవలం భక్తి అనో, మతానికి సంబంధించిన అంశమో కాదని గుర్తించాలి. ఎవరైనా దీనిని ఆచరించడం అంటే మంచిని స్వీకరించిడం అని గుర్తించాలి. మానవ జీవన విధానాన్ని ఒక ఉత్తమమైన మార్గంలో నడిపే మార్గమే మన ఆధ్యాత్మికత అని గుర్తించాలి. పెద్దలు ఏదో చెప్పారని చేసే పూజలు మనకు అర్థమయ్యాక తత్వం బోధపడుతుంది. ఆధ్యాత్మికత అంటే ముక్కు మూసుకుని జపం చేయడం కాదు. మనం మంచి అలవాట్లకు దగ్గర కావడం అన్నది గుర్తించాలి. మనసు నిండా కోరికలతో పూజలు, జపాలు, తపాలు, యజ్ఞాలు, యాగాలు చేయడం కూడా మంచిని కాపాడడం ఎంతమాత్రమూ కాదు. ద్దలను గౌరవించడం, తోటివారికి చేతనైనంత సాయం చేయడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, ఆకలిగొన్నవారికి అన్నం పెట్టడం, మనకన్నా బలహీనులను హింసించకుండా ఉండడం.. ఇదంతా ఓమంచి ఆచారంగా చూడాలి. ప్రపంచంలో చాలా దేశాలు ఇప్పుడు తామెంతగా అభివృద్ధి చెందినా భారతీ సాంస్కృతిక జీవనం వైపు మొగ్గుచూపుతున్నారు.భారతీయ జీవన విధానానికి, మన సంస్కృతికి చేతులెత్తి మొక్కుతున్నారు. మన ఆధ్యాత్మిక జీవనవిధానం గురించి తెలుసుకున్న ఎందరో పాశ్చాత్యులు భారతదేశానికి వచ్చి ఇక్కడి సంస్కృతీసంప్రదాయాల గురించి తెలుసు కుంటున్నారు. పరిశోధనలు చేస్తున్నారు. దీనికి కారణం మనకున్న గొప్ప ఆధ్యాత్మిక సంపద మరే మతానికి లేదా దేశానికి లేకపోవడమే అని గుర్తించాలి. వేదాలు, అష్టాదశ పురాణాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురణాలు.. ఇలా మన ఆధ్యాత్మిక సంపద ఎంతో ఘనమైనదని గుర్తించారు. సృష్టి అంతా నిండి ఉన్న చైతన్యం ఒక్కటేనని.. ఆ చైతన్యమే పరమాత్మ అని మన సంస్కృతి చెబుతుంది. అందుకే సృష్టిలో ప్రతిదీ మనకు పూజనీయమే. మనం పుట్టినప్పటి నుంచి చనిపోయేవరకూ సౌకర్యవంతంగా, సుఖంగా జీవించ డానికి అవసరమైన వనరులను ఎన్నింటినో ఈ ప్రకృతి అందిస్తుంది. అందుకే మనం ప్రకృతిని తల్లిగా భావించి పూజిస్తాం. భూమిని దేవతగా గౌరవిస్తాం. ప్రాణాధారమైన నీటిని, గాలిని.. ఇలా పంచభూతాలనూ దైవాలుగా భావించి కొలుస్తాం.


# తడిసి ముద్దయిన శ్రీకాకుళం జిల్లా

శ్రీకాకుళం,ఆగస్ట్26:బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సాయంత్రం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో లోతట్టు- ప్రాంతాలు జలమయం అయ్యాయి. నరసన్నపేట సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్లు నీటిలో మునిగాయి. నరసన్నపేట, జలుమూరు మండలాల మధ్య గొట్టిపల్లి రహదారిపై భారీగా వర్షపు నీరు చేరింది.

# గణపతి సర్వశక్తులకు అధిపతి

## అందుకే ఆయనకు తొలిపూజ

కాణిపాకం,ఆగస్ట్26: గణపతి సర్వవిద్యాధి దేవతగా, వేదకాలం నుండి ఆరాధనలందుకుంటున్న దైవం, వేదాలలో స్తుతించబడి, గణాలకు అధిపతియై, శబ్దాలకు రాజుగా, ప్రణవ స్వరూపుడై శబ్దబ్రహ్మగా జ్ఞానానికి ప్రతీకగా నిలిచాడు.సృష్టి ఆదిలో దేవతా గణాల ప్రారంభం కంటే ముందే గణనాథునితో సృష్టి ప్రారంభించినట్లు వినాయక పురాణం తదితర పురాణాలు మనకి సూచిస్తున్నాయి. సృష్టి ప్రారంభానికి ముందు ఒకప్పుడు అమ్మవారు రాక్షసులతో యుద్ధం చేస్తున్నది. ఇంకా మనుషులే పుట్టకముందు అన్నమాట. అమ్మవారు పరమేశ్వరుణ్ణి తలచుకొన్నది. ఆయన అక్కడ ఉన్నారు. వారి చూపులు కలసినవి. ఆ చూపుల కలయికకి విఘ్నేశ్వరుడు పుట్టాడు. అంతటి పూర్వుడాయన. ఆయన పేరు మహాగణపతి. ఆ మహాగణపతి అవతారాలనే ఇప్పుడు మనం ప్రతి కల్పంలోనూ పూజిస్తున్నాం. సమస్త మంత్రాలలోను శక్తికి కారణాలైన బీజాక్షరాలన్నింటిలోకి ముందుగా ఉచ్చరించేదే 'ఓంకారం' అందుచేత ఈ గణపతిని ఓంకార స్వరూపుడిగా వర్ణించారు. విఘ్ననిర్మూలనకై అవతరించి మంగళ స్వరూపుడై సకల మానవాళికి ఆరాధ్యమూర్తియై నిలిచాడు. మహాశక్తి అయిన పార్వతీదేవికి 'ద్వారపాలకుడుగా'గణపతిని పెట్టినట్టు మన పురాణగాథ, దీనిలో అంతరార్థం ఏమిటంటే? మూలాధారంలో కుండలినీశక్తి యోగనిద్రలో ఉంటుంది అని, ఈ కుండలిని శక్తియే మహాశక్తి .అ మూలాధారంలో కుండలిని శక్తిని మేల్కొలపడానికి ప్రవేశించే ద్వారం వద్దనే గణపతి కావలిగా ఉన్నాడు. అంటే గణపతి బీజాక్షరంతో మూలాధారాన్ని చైతన్యవంతం చేస్తే శక్తిని మేల్కొల్పటం సాధ్యపడు తుంది. భక్తులకు సకల శుభాలను చేకూర్చే వినాయకుడు తాను భక్తుల పాలిట కల్పతరువు అని సూచించకనే సూచిస్తూ ఉంటాడు! ఆయన భంగిమలను కాస్త గమనిస్తే అవుననే అనిపిస్తుంది. చాలా ప్రతిమలలో వినాయకుడు తన ఎడమ కాలుని



ముడుచుకుని, కుడిపాదాన్ని కిందకి ఉంచి కనిపిస్తాడు. దీనినే యోగ శాస్త్రంలో లలితాసనం అంటారు. సాక్షాత్తూ జ్ఞానానికి ప్రతిబింబమైన లలితాదేవి కూడా ఈ ఆసనంలోనే కనిపిస్తుంది. భారతీయ ప్రతిమలలో ఇది కాస్త అరుదైనప్పటికీ, బౌద్ధానికి సంబంధించిన ఎన్నో శిల్పాలు ఈ ఆసనాన్ని సూచిస్తుంటాయి. ఒక పక్క ప్రశాంతంగా ఉంటూనే అవసరమైనప్పుడు ఎలాంటి కార్యాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండే తత్వానికి ఈ ఆసనాన్ని ప్రతీకగా భావిస్తారు. కర్మయోగులకు ఈ రెండూ అవసరమే కదా! ఒక పక్క జీవితంలో ఎదురయ్యే ఒడుదొడుకులను ఎదుర్కొంటూనే, మనసుని స్థిరంగా నిలుపుకోగలడమే మానవులకి నిజమైన సవాలు. తాను అలాంటి స్థితిలో ఉన్నానని గణేశుడు చెప్పకనే చెబుతున్నాడు. తనను కొలిచే భక్తుల విఘ్నాలను తొలగించి వారిని కూడా పరిపూర్ణమైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతానని హామీ ఇస్తున్నాడు. అందుకనే భక్తులు ఎక్కువగా లలితాసనంలో ఉన్న వినాయకునికే పూజలు చేస్తుంటారు.

# ఆమె ఓ అవినీతి అనకొండ

## తాటకిలా అందరినీ తొక్కి పెట్టారు

## డబ్బు సంపాదనే ధ్యేయంగా పరిపాలన

## మంత్రులను కూడా లెక్కచేయని వైనం

## ఓ ఐఎఎస్ అధికారి అంటూ భూమన వీడియో విడుదల

తిరుపతి,ఆగస్ట్26 వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో అవినీతికి పాల్పడి అరెస్టు అయిన ఓ మహిళా అధికారిణపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యాలు చేశారు. ఆమె అవినీతిలో అనకొండ లాంటిదని తీవ్ర విమర్శలు గుప్పించారు. తిరుపతిలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై మంత్రి నారాయణ చేసిన కామెంట్స్ నేపథ్యంలో భూమన కరుణాకర్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు ఓ వీడియోను విడుదల చేశారు. సదరు అవినీతి అధికారి గతంలో మంత్రులను సైతం పూచికపుల్లలా చూసిందన్నారు. కనీసం తన శాఖకు సంబంధించిన మంత్రులను కూడా లెక్క చేయదంటూ ఆమె తీరును తప్పుపట్టారు. ఆమెకు డబ్బులు సంపాదించడమే తప్ప ఎలాంటి నైతిక విలువలు లేని అధికారని, తాటకి లాగా కింది స్థాయి అధికారుల పట్ల వ్యవహరించారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో తాము రోడ్లు వేస్తున్న సమయంలో అ అధికారి టీడీఆర్ బాండ్ల ద్వారా వందల కోట్లు కొట్టేయాలనే ప్లాన్ వేస్తే దానిని తాము అడ్డుకున్నామని, ఇది తట్టుకోలేక ఆమె నెల్లూరు జిల్లా నేతలకు తాము రెండు వేల కోట్లు దోచుకున్నా మంటూ ప్రచారం చేయించిందన్నారు. ఆ అధికారి గత 35 ఏళ్లుగా ఎక్కడ పనిచేసినా అవినీతికి పాల్పడుతూ వందల కోట్లు దోచుకుందని ఆరోపించారు. మీ అవినీతి గురించి మాకు బాగా తెలుసు అని అత్యున్నత న్యాయస్థానం సైతం ఆమె గురించి వెటకారంగా చెప్పిందన్నారు. రోజూ ఆమె ధరించే చీర లక్షన్నర రూపాయలు అని.. 50 లక్షల రూపాయలకంటే విలువైన విగ్గులు ఆవిడకు 11 ఉన్నాయి అని.. ఒక్కో రోజు ఒక్కో విగ్గుతో దర్శనమిస్తుంటారంటూ భూమన సంచలన వ్యాఖ్యలు చూశారు. వైకాపా హయాంలో ఆ అధికారిణి పురపాలక శాఖ బాధ్యతలను పర్యవేక్షించారు. తన శాఖ మంత్రులను సైతం లెక్కచేయలేదు. డబ్బు సంపాదించడమే తప్ప.. ఏ నైతిక విలువలూ లేని మనిషి. ఒక్క మాటలో చెప్పాలంటే ఓ తాటకిలా కింది అధికారుల పట్ల ఆమె వ్యవహరించారని భూమన తీవ్ర విమర్శలు చేశారు.

# వినాయక మండపంవద్ద విషాదం

## లైటింగ్ డెకరేషన్‌లో షాక్‌తో యువకుడు మృతి

అనంతపురం,ఆగస్ట్26: చవితికి ముందే విషాదం చెలరేగింది. వినాయక మండపానికి డెకరేషన్ చేస్తూ కరెంట్ షాక్ తగిలి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలం పరిధిలోని కోమటికుంట్లలో సోమవారం రత్రి జరిగింది. సుమారు రాత్రి 10:30 గంటల సమయంలో, మండల పరిధిలోని కోమటికుంట్ల గ్రామం రామాలయం వద్ద వినాయక మండపానికి పసుపులేటి రాజేష్ (18) డెకరేషన్ లైట్స్ అమర్చుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి కింద పడిపోయాడు. వెంటనే అతడిని అక్కడున్న వారు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరిశీలించి అతను మృతిచెందినట్లు- నిర్ధారించారు. ప్రస్తుతం యువకుడి మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పసుపులేటి.సాయినాథ్, సుజాతల కుమారుడు పసుపులేటి.రాజేష్. ఇతడు తాడిపత్రి ప్రైవేట్ కాలేజీ లో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. రాజేష్‌కు ఒక అన్న, ఒక చెల్లెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తిరుమలలో కూలిన భారీ చెట్టు

## ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుకు ప్రమాదం

తిరుమల,ఆగస్ట్26: తిరుమలలో పెద్ద ప్రమాదం తప్పింది. మంగళవారం మధ్యాహ్నం తిరుమల ఎంబీసీ సమీపంలో పెద్ద చెట్టు ఒక్కసారిగా నేలకూలింది.ఈ ప్రమాదంలో టీటీడీ ప్రైవేట్ భద్రతా సిబ్బంది చంద్రశేఖర్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. గార్డును చికిత్స కోసం వెంటనే అశ్వినీ ఆస్పత్రికి తరలించారు.ఘటన జరిగినప్పుడు చెట్టుకు సమీపంలో భక్తులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రాణనష్టం జరగలేదు. చెట్టు- పడిన సందర్భంలో భారీ శబ్దం రావడంతో భక్తులు, సిబ్బంది ఒక్కసారిగా గందరగోళానికి గురయ్యారు.సంఘటన సమాచారం అందుకున్న వెంటనే విజిలెన్స్ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. కూలిపోయిన చెట్టు భాగాలను తొలగింపు పనులను చేపట్టారు.

# బిజెపి అంటే చంద్రబాబు, జగన్, పవన్ !

## సిపిఐ కార్యదర్శి రామకృష్ణ ఎద్దేవా

ఒంగోలు,ఆగస్ట్26: బీజేపీ అంటే బాబు (చంద్రబాబు నాయుడు), జగన్ (వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పవన్ (పవన్ కల్యాణ్) అంటూ సెటైర్లు వేశారు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ.. ప్రకాశం జిల్లా పర్యటనలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు విషయంలో ఆ పార్టీలపై మండిపడ్డారు.. ఇక, వైసీపీ ఆవిర్భావం తర్వాత బీజేపీకి ఒక్కసారి కూడా వ్యతిరేకంగా ఓటు- వేయలేదు.. బీజేపీ ప్రవేశపెట్టిన బిల్లులన్నింటికీ వైసీపీ ఓటు- వేసిందని దుయ్యబట్టారు.. మరోవైపు చంద్రబాబు బీజేపీకి ఒకసారి దూరమై తిరిగి దగ్గరయ్యాడని.. రాష్ట్రంలో ఉన్న టీ-డీపీ, జనసేన, వైసీపీ.. బీజేపీకి మద్దతుగా ఉన్నాయని మండిపడ్డారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అన్ని రాష్ట్రాల్లో ఇండియా కూటమి అభ్యర్థికి, ఎన్డీఏ అభ్యర్థికి ఓట్లు- పడతాయి... కానీ, ఒక్క ఏపీలోనే ఎన్డీఏ అభ్యర్థికి వన్ సైడ్ ఓట్లు- వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు రామకృష్ణ.. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అంటూ కొత్త నిర్వచనం చెప్పి ఆయన.. ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డిని కించపరిచే విధంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేస్తున్నారు.. ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు.. మరోవైపు, ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడింది. పంటలు సాగుకి ఎరువులు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్.. కేంద్రం వద్ద ఎరువులు తీసుకురాలేకపోయిందని ఎద్దేవా చేశారు.. యుద్ధ ప్రాతిపదికన రైతులకు ఎరువులు సరఫరా చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు..

# పర్యావరణహిత గణేశ విగ్రహాల తయారీ

మెదటిపేజీ తరువాయి...

ఏర్పాటుకు ఉచితంగా అనుమతులతో పాటు- ఉచితంగా కరెంటును రాష్ట్ర ప్రభుత్వం అందజేయడం జరుగుతోందని.. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు పండగ పవిత్రతను కాపాడుకుంటూ కార్యక్రమాలు నిర్వహించాలని.. ఇందుకు స్వీయ క్రమశిక్షణ అవసరమని సూచించారు. గణేష్ విగ్రహాల తయారీకి ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులు ఉపయోగించడం వల్ల ప్రకృతి వనరులు కాలుష్యానికి గురవుతాయని.. కేన్సర్ కేసులు పెరగడానికి కాలుష్యం కూడా కారణమని పేర్కొన్నారు. ఓ గొప్ప అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేసిన వినూత్న ప్రయత్నం రికార్డు సాధనకు తోడ్పడిందని.. ఇందుకు జిల్లా అధికార యంత్రాంగానికి అభినందనలు తెలియజేస్తున్నట్లు- మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ అంటేనే వైబ్రెంట్ నగరమని.. చెత్త రహిత నగరం కేటగిరీలో నగరానికి సెవెన్ స్టార్ రేటింగ్ లభించిందని.. ప్రజా చైతన్యం, సమష్టి కృషివల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. పర్యావరణ, ఆధ్యాత్మిక శోభతో వినాయక చవితి ఉత్సవాలన నిర్వహించనున్నట్లు- వివరించారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇది పర్యావరణంపట్ల ప్రజల్లో చైతన్యం తెచ్చే ఓ గొప్ప కార్యక్రమమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాల్సిన అవసరముందని.. పర్యావరణ పరిరక్షణతో నగరాన్ని, రాష్ట్రాన్ని దేశాన్ని కాపాడుకుందామని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ ఇంతమంది ప్రకృతి ప్రేమికులు ఒక్కచోట చేరి పర్యావరణ పరిరక్షణపై ప్రజలను జాగృతం చేయడం ఆనందం కలిగిస్తోందని పేర్కొన్నారు. విశాఖపట్నం, విజయవాడలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు సమష్టిగా కృషిచేస్తున్నామని అన్నారు.

# నాటు సారాయి రహిత గ్రామంగా నేమం

కాకినాడ ఆగస్టు 26 నాటు సారాయి రహిత గ్రామంగా నేమంను తీర్చిదిద్దామని కాకినాడ జిల్లా ఎక్సైజ్ ఎస్పై కే. రామ్మోహన్రావు అన్నారు. మంగళవారం కాకినాడ రూరల్ నేమం గ్రామంలో నవోదయం 2.0 పథకంపై విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేమం గ్రామంలో ప్రజలు నాటు సారా జోలికి వెళ్లకుండా ఇతర జీవన ఉపాధి కల్పిస్తామన్నారు అలాగే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో అర్హులైన వారికి అందేలా ప్రత్యేక బాధ్యతలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది గ్రామ సర్పంచ్ సూర్యప్రకాశరావు పంచాయతీ కార్యదర్శి ఎస్ .వి .ఎల్ దేవి వీఆర్వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# నామ్ టెక్ తో ఏపీ నిట్ అవగాహన ఒప్పందం

తాడేపల్లిగూడెం ఆగస్టు 26 :తాడేపల్లిగూడెం.నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్), నిప్పన్ స్టీల్ ఇండియా (గుజరాత్) కు చెందిన నామ్ టెక్ (న్యూ ఏజ్ మేకర్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) తో మంగళవారం అవగాహన ఒప్పందం చేసు కుంది. నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి .రమణారావు, నామ్ టెక్ ప్రోగ్రామ్ డైరెక్టర్, (ఆటో సిఓఈ) డాక్టర్ కే.సి వోర ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఒకరికొకరు మారు ్చకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రమణారావు మాట్లాడుతూ స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, మొబిలిటీ, రోబోటిక్స్, స్పేస్ అండ్ డిజిటల్ టెక్నాలజీ, కృత్రిమ మేధ వంటి సాంకేతిక రంగాల్లో పరస్పర న ఎ ా s ా ం ం అందించుకునేందుకు, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా మిషన్లను బలోపేతం చేసేందుకు ఈ ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. వీటితోపాటు పరిశోధనలు, ఇన్నోవేషన్లను సంయుక్తంగా నిర్వహించడానికి పాఠ్య ప్రణాళిక, పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా కరికులం రూపకల్పన, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లు, స్టార్టప్ లు, మెంటరింగ్, హ్యాకథాన్ నిర్వహించడానికి, విద్యార్థులు నామ్ టెక్ ఫెలోషిప్ లు పొందడానికి కూడా ఈ ఒప్పందం దోహదపడుతుందని తెలిపారు. ఈ విద్యా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులు సౌకర్యార్థం పలు విద్యాసంస్థలు కంపెనీలతో అవగాహన ఒప్పందాలను చేసుకుంటున్నామని తాజాగా చేసుకున్న ఒప్పందం 35వదని వివరించారు. ఈ కార్యక్రమాన్ని డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, అసోసియేట్ డీన్ డాక్టర్ వినోత్ కుమార్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నామ్ టెక్ ప్రోగ్రామ్ డైరెక్టర్, ( స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్) డాక్టర్ వాసు వెలగపూడి, అసోసియేట్ డైరెక్టర్, ఆకడమిక్స్ డాక్టర్ అమిత్ పటేల్, నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి. దినేష్ శంకర్ రెడ్డి, డీన్ లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ వీరేశ్ కుమార్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, అసోసియేట్



# మట్టి వినాయకుని పూజ పర్యావరణ పరిరక్షణ సందేశం

## మహిళా మండలి అధ్యక్షురాలు కొవ్వూరి సీత మాట్లాడుతూ:

పెనుమంట్ర: ఆగస్టు 26,గణనాధుడు అనగా విఘ్నాలను తొలగించే దేవుడు. ప్రతి సంవత్సరం గణేష్ చతుర్థి పండుగను ఎంతో ఆనందంగా జరుపుకుంటాం. కానీ ఈ పండుగలో మనం మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే పూజించాలి. ఎందుకంటే.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు ( పిప్ ఐ డోలాస్ ) నీటిలో కరుగవు.అవి పర్యావరణానికి హానికరం, నీటిలో జీవించే చేపలు,మొక ్కలునష్టపో ోతాయిరసాయన రంగులు కూడా నీటి కాలుష్యం కలిగిస్తాయి.అందుకే మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించి మన ఇళ్ళలో భక్తి శ్రద్ధలతో పూజించాలి. ఇది పర్యావరణానికి మేలు చేస్తుంది.పూజ మాత్రమే కాదు ఒక సంకల్పంఈ వినాయక చవితిసందర్భంగావ నమందరం:1. మట్టి గణపతి పూజ చేయాలి.2. నిమజ్జనం చేసినప్పుడు మన ఇంటి ప్రాంగణంలో లేదా కాలనీలో ఒక మొక్క నాటాలి.ఆ మొక్క గణపతి పండుగకు గుర్తుగా నిలుస్తుంది.చెట్లు పెరగడం వలన గాలి, వర్షం, నీరు సమతుల్యం అవుతాయి.మన భవిష్యత్తు తరాల కోసం పచ్చదనాన్ని కాపాడుతుంది.ప్రభుత్వానికి, సమాజానికి విన్నపం.ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ చర్యలకు తోడ్పాటు ఇవ్వాలి.



# రాష్ట్రాభివృద్ధికి కేంద్ర తోడ్పాటు ఏడాదిన్నరలో రాష్ట్రానికి 10 లక్షల కోట్ల పెట్టుబడులు

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

కాకినాడ ఆగస్ట్ 26: రాష్ట్రాభివృద్ధికి కేంద్రప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా కాకినాడ జిల్లాలో మంగళవారం ఆయన పర్యటించారు. చాయ్ పే చర్చ, మల్లాడి సత్యలింగ నాయకర్ విగ్రహంకి నివాళులు, టూటౌన్ సెంటరు నుండి కార్యకర్తలు, నాయకులతో ర్యాలీ, అనంతరం సూర్యకళా మందిరంలో నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాధవ్ విలేకరులతో మాట్లాడుతూ తన పర్యటనలో భాగంగా అనేక వర్గాలను కలిసి సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వినాయక పందిళ్లకు ఉచిత విద్యుత్ ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. రాబోయే దుర్గా నవరాత్రులకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరుతున్నామన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ కాకినాడ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. అభివృద్ధికి వివిధ శాఖల ద్వారా పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తున్నారన్నారు.కోతకు గురవుతున్న ఉప్పాడ సముద్ర తీరంలో జియో టాగ్ లైన్ నిర్మాణానికి కృషి జరుగుతోందని, మడ అడవులు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.కేంద్రం ద్వారా అనేక పరిశ్రమలు రాష్ట్రానికి రాబోతున్నాయన్నారు. ఏడాదిన్నర కూటమి ప్రభుత్వ కాలంలో పది లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. మోడీ మూడవసారి అధికారంలోకి వచ్చాక సోలార్ కరెంటు ఉత్పత్తిపై చర్యలు చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వం సూర్య గృహ్హా పేరుతో కేంద్ర పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇండియా కూటమి రోజుకో అబద్ధం ప్రచారం చేస్తోందని విమర్శించారు. కూటమి పాలన బాగుందన్నారు. కూటమి భాగస్వాములతో కలిసి ముందుకు వెడతామన్నారు. వైసీపీ హయాంలో కాకినాడ స్మార్ట్ సిటీ నిధులు దుర్వినియోగమయ్యాయన్నారు. కాకినాడ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఏర్పాటు, విద్యుత్ తీగలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం కోటిపల్లి రైల్వే లైన్కు తన వాటా నిధులు ఇవ్వని కారణంగా పనులు ఆలస్యం అయ్యాయని, త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని మాధవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మి ప్రసన్న, మీడియా ఇంచార్జ్ యెనిమిరెడ్డి మాలకొండయ్య, పైడా కృష్ణ మోహన్, జిల్లాలోని నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# అన్ని శాఖల పనితీరు మెరుగుపడాలి కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ ఆగస్టు 26 : ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా అన్నీ శాఖలు తమ నుండి సేవలు పొందిన లబ్దిదారులను సంప్రదించి సర్వే జరుగు సమయములో సంతృప్తికరమైన అభిప్రాయాలు తెలియజేయడంలో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ స్మార్ట్ సిటీ మీటింగ్ హాల్ లో జరిగిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా జరిగిన వర్క్ షాప్ కు జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. ట్రైనీ కలెక్టర్ మానీషాతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా జిల్లాలో ఏకగవాక్ష విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన, పరిష్కరించడంలో జిల్లా అధికారి యంత్రాంగం ముందు ఉంటుందన్న ఆయన తెలిపారు.తాను కూడా ఎప్పుడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ జరగబోవు సర్వే నందు సంబంధిత శాఖల నుంచి సేవ పొందిన లబ్దిదారులు సానుకూల స్పందన తెలియజేయవలసినదిగా ఆయన కోరారు. తద్వారా ఈ సంవత్సరము కూడా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో మన రాష్ట్రం మొదటి స్థానం పొందే విధముగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్.గణపతి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సర్వే గూర్చిన వివరాలు ఆయా శాఖల నోడల్ అధికారులకు మరియు వివిధ శాఖల నుండి ఏక గవక్ష విధానం ద్వారా సేవలు పొందిన లబ్దిదారులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం వినాయక చవితి వేడుకలను ప్రజలు పర్యావరణ హితంగా జరుపుకోవాలని అవగాహన కల్పిస్తూ కాకినాడ జిల్లా కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సమావేశములో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణా రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ నారాయణమూర్తి, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ, ఎంహెచ్ఓ డా. పృధ్వి చరణ్ ఇతర శాఖల అధికారులు, పరిశ్రమల శాఖ సిబ్బంది, అరుణ్ సందీప్, రాజేష్ కుమార్, సురేష్ కుమార్ మరియు వివిధ అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.




# అలయన్స్ శరవణ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల పంపిణీ

కాకినాడ, ఆగస్ట్ 26: అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో సర్పవరం కూడలిలోని రూరల్ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో పర్యావరణ హిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు యాళ్ళ రత్నరావు పర్యావరణ పరిరక్షణలో మట్టి విగ్రహాల ప్రాముఖ్యతను వివరించారు.ముఖ్య అతిథి రూరల్ తహశీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి కార్యక్రమాన్ని ప్రారంభించి, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినందుకు క్లబ్ సభ్యులను అభినందించారు. కొవ్వూరి మునిరెడ్డి, ప్రోగ్రామ్ ఛైర్మన్ కుదిపూడి వెంకటేశ్వరరావు, యడవిల్లి మురళీధర్ వినాయక చవితి విశిష్టతను తెలిపారు. వినాయక ప్రతిమలను బండారు భాస్కరరావు డిఎల్ శాస్త్రిలు బహుకరించారు. ఆర్ రవిశంకర్ పత్నాయక్, జె కృష్ణప్రసాద్, పాలురి సుబ్బారావు, మాలాది మనోహర వర్మ, కార్యదర్శి దులుపూడి రామకృష్ణ, మాలాది ఈశ్వరి, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, కోల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.




# ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

## ఎం.డి. ద్వారకా తిరుమలరావు!

తాడేపల్లిగూడెం , ఆగస్టు 26: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్. ద్వారకా తిరుమలరావు తనను కలిసిన రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలకు హామీ ఇచ్చారు. మంగళవారం తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావు వచ్చారు. ఈసందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధి బృందం ఆయనను కలిసింది. స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీమ్ లో విశ్రాంత ఉద్యోగులకు ఇస్తున్న పింఛనును ప్రతీ నెలా ఒకటో తేదీనే ఇవ్వాలని , విశ్రాంత ఉద్యోగులకు ,జీవిత భాగస్వామితో సహా సూపర్ లగ్జరీ బస్సులలో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ వారు ఒక వినతిపత్రాన్ని అందచేశారు. ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావును కలిసిన వారిలో రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏ.నరసింహారావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఓసూరి వీర్రాజు, జిల్లా కార్యదర్శి ఆర్.ఎస్. కుమార్, సహాయ కార్యదర్శి జీ.వెంకట్రావు, పట్టణ అధ్యక్షులు జి.సోమేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి ఆలమూరు సత్యనారాయణ, మద్దుకూరు కోటేశ్వరరావు, పి.సుబ్బారావు తదితరులు ఉన్నారు. ఆర్టీసీలో మూడు నాలుగు దశాబ్దాల పాటు పనిచేసి 2014 కు ముందు ఉద్యోగ విరమణ చేసిన వారికి కనీస పింఛను వెయ్యి రూపాయలు మించి రావడంలేదని , ఆ తర్వాత రిటైరైన వారిలో అత్యధికులకు రెండు మూడు వేల రూపాయలు మించి రావడంలేదని విశ్రాంత ఉద్యోగుల పిల్లలు హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో ఉంటున్నారని వారు ఎండికి వివరించారు. తమకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరారు.దానిపై సి.హెచ్. ద్వారకా తిరుమలరావు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రేషన్ వ్యవస్థలో సంస్కరణలకే స్మార్ట్ కార్డులు

## భీమవరం నియోజకవర్గంలో 79,214 స్మార్ట్ కార్డులు 28వ వార్డులో స్మార్ట్ కార్డులను అందించిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం ఆగస్టు 26 ఎలాంటి అవకతవ కలకు చోటు లేకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్న సంకల్పంతోనే సంక్షేమానికి టెక్నాలజీని జోడించి ప్రజలకు స్మార్ట్ కార్డులు అందించడం జరుగుతుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం 28వ వార్డు రెస్ట్ హౌస్ రోడ్డులో సోమవారం కూటమి ఆధ్వర్యంలో క్యూ ఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులను అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే అంజిబాబు, డిఆర్వో వెంకటేశ్వర్లు స్మార్ట్ కార్డులను అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో 79,214 స్మార్ట్ కార్డులను అందిస్తున్నామని, భీమవరంలో 59,251, వీరవాసరంలో 19,963 స్మార్ట్ కార్డులు లబ్ధిదారులకు అందిస్తున్నామని అన్నారు. నాలుగు దశల్లో ఈ కార్డులను అందిస్తున్నామని, మొదటి దశ ఈనెల 31 వరకు, రెండో దశ సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు, మూడో దశ 16 నుంచి 20, నాల్గో దశ 21వ తేదీ నుంచి అందిస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం, రెండు కళ్ళుగా అమలు చేస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పరిపాలిస్తున్నామని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుతో ప్రజల్లో ఆనందం వెల్లివిరిస్తోందని, ఉచిత బస్సు ప్రయాణం పట్ల మహిళలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

# కలెక్టరేట్ తరలిస్తే కాంగ్రెస్ పార్టీ తరపున ఉద్యమానికి సిద్ధం..

## అంకేనీ సీతారాం..

భీమవరం ఆగస్టు 26 పశ్చిమగోదావరి జిల్లా భీమవరం లో ఉన్న కలెక్టరేట్ను తరలిస్తామంటూ వస్తున్న వార్తల బట్టి భీమవరపు ప్రజలు అయోమయ స్థితిలో ఉన్నారని కలెక్టరేట్ ఎక్కడనేది సరైన స్పష్టత లేకపోవడంతో ప్రజలు ఎలా అర్థం చేసుకోవాలి కలెక్టరేట్ ను ఉండి కి తరలిస్తే ఉద్యమస్తామని కాంగ్రెస్ పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అంకెం సీతారామ్ తెలిపారు. ఇప్పటివరకు ఏ విధంగా ఏ స్థానంలో అయితే ఈ కార్యాలయం ముందు అక్కడనుండే విధులు నిర్వహించాలని అన్నారు. భీమవరం పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు కేంద్రబిందువుగా ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో తరలింపు ప్రజల్లో మంచి అభిప్రాయాన్ని తీసుకురాదని అన్నారు. బిజెపి, టిడిపి, జనసేన పార్టీలోకి చెందిన ఎంతో మంది ప్రముఖులు భీమవరంలో ఉండి అల్లాలింపుని ఒక సినిమా కథలాగా చూస్తున్నారని విమర్శించారు. దృష్టికి తీసుకువెళ్లి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంకెం సీతారాం, కిసాన్ కాంగ్రెస్ బోనం రవికుమార్, గనీజాల సుబ్రహ్మణ్యం , అయినంపూడి వెంకటరామరాజు, సోడాదాసి సిలివియా, మేడపాటి సాగర్, కొండపల్లి రవికుమార్, పలు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com